DISCIPLINE.

క్రమశిక్ష.

పాఠశాలాక్రమశిక్షాప్రదర్శని.

A MANUAL OF SCHOOL METHOD

IN TELUGU

FOR

Lower Secondary and Primary Grade Students
in Training Schools and Village Teachers

BY

M. H. SUBBARAYADU
Headmaster
Government Lower Secondary Training School, Guntur

PART II.

FIRST EDITION

"As is the Master so is the School"

PRINTED AT THE ANANDA PRESS,
MADRAS.
1898.

Price 4 Annas. వెల 4 అణాలు.

ఉపాధ్యాయ యోగ్యతాప[illegible] జరుపఁబడు[illegible] క్రమశిక్ష యందు ననేకులుతప్పిపోవుటను శ్రీ డైరక్టరుగారుగుర్తించి [illegible] నన పాఠశాలలయందుఁ జక్కఁగాబోధింపఁబడక పోవుటచే నాలో[illegible] యభి ప్రాయపడి టీచర్సు కాలేజి ప్రిన్సిపల్ గారును వైస్ ప్రిన్సిపల్ గారును కలిసి క్రమ శిక్షయొక్క ముఖ్యవిషయములపట్టి యొకదానిని సిద్ధముచేయవలసినదని యేర్పాటుచేసిరి. అట్లు వారుభయులుకలిసి యీక్రిందివిధమున సిద్ధముచేసి వారినముఖమునకుఁబంపగా శ్రీ డైరక్టరువారు దానిని సె 3813 రు గల్గి 1897 సం॥ ఏప్రిల్ 6 వ తేదీగల వారిప్రొసి డింగ్సులో నంగీకరించిరి.

క్రమశిక్షయు, నీతియు.

(1) క్రమశిక్ష.

(a) క్రమశిక్ష దేనిని దేనిని చేర్చుకొనును.

(b) పాఠశాలయందు దానితాత్కాలిక ప్రయోజనములు.

(c) మంచి క్రమశిక్షయొక్క చిహ్నములు.

(d) క్రమశిక్షను నిలుపుటకై ఉపాధ్యాయునియందుండవలసిన ముఖ్యగుణములు.

(2) క్రమశిక్షవలని యుద్దేశములు.

(a) క్రమము, శ్రద్ధ, పరిశ్రమము, విధేయత, ఇవియనఁగానేమి ? వీనివలన లాభమేమి ? వీనినిమీఱుటకుఁ గారణములేమి ? వీనిని వృద్ధిపఱచుటకు సాధనములేవి ?

(b) సత్యవాదిత్వము, యోగ్యత, దయ, శుభ్రత్వము, నిర్మలత్వము, క్రమానుసారము, సమయపాలనము, వీనిముఖ్యతయు, వీనిని వృద్ధిపఱచు సాధనములును.

(c) వాడుకలు, గుణములు ఏర్పడుట.

(3) బాల్యలక్షణములు.

(a) ముఖ్యములగు మనోవికారములు, భావాదుల ఏర్పాటు, మనోబలము.

(d) ముఖ్యములగు సహజజ్ఞానములు, భావములు అనఁగా చాకచక్యము, అనుకరణము, పరిశోధకబుద్ధి, సమదుఃఖతలేక కనికరము, ప్రతిస్పర్ధ, భయము.

(c) సుఖము, దుఃఖము, భావములుగా,

(4) క్రమశిక్షకు సాధనములు.

(a) మంచిపాఠశాలా యేర్పాటులు, కవాతు, కొన్నిచట్టములు మొదలగు బాహ్యపరిష్కారములు.

(b) ఉపాధ్యాయుని యధికారము.

(c) జనులయభిప్రాయము, దానివలనిప్రయోజనము, అదిపాఠశాలలో నేర్పడు విధము.

(d) సహజజ్ఞానములు, భావములు, వీనియొక్కయుపయోగము వీనిని నిర్వహించుటయును.

(e) బహుమానములు,శిక్షలు, వానివిలువలు,వానియుపయోగములయొక్కస్థితులు.

(5) నీతి.

(a) ఒకపాఠశాలలో నీతి విద్యయొక్కలక్ష్యములు, ఉద్దేశము.

(b) ఉపాధ్యాయునియొక్క విధాయకకృత్యములు.

(c) దృష్టాంతముయొక్కయు ఆజ్ఞయొక్కయు బలము.

(6) బహుమానములు.

(a) బహుమానములవలని లాభనష్టములకు హేతువులు.

(b) ఒకపాఠశాలయందు సామాన్యములగు బహుమానములు అనగా వానివిలువ, వానియుగత్యము, ప్రతివానియొక్క యుపయోగపద్ధతి.

(7) శిక్షలు.

(a) వాని యావశ్యకత, సాధారణముగా శిక్షలయొక్క యుద్దేశమును, స్వభావమును.

(b) వానిని సాధ్యమైనంత తగ్గించువిధము.

(c) ఒకపాఠశాలయందలి సాధారణశిక్షలు, వానితరుణములు, వానిఫలములు, ప్రతితరహాయొక్క యుపయోగములు.

(d) శిక్షలు విధించుటకు సామాన్యములగు నియమములు.

(2) ఎడ్యుకేషనల్ రూల్సులో లోవర్ సెకండరీ గ్రేడువారికిఁ గ్రమశిక్షలోఁ గావలసినయంశములు అనఁగా (1) క్రమశిక్షయొక్క ముఖ్యభాగములు (2) దానియుద్దేశములు (3) దానినిలుపు సాధనములు (4) బహుమతులు, శిక్షలు,వీనినికలిపి విశదముగా వ్రాసితిని. నీతివిద్యనుగుఱించి యీగ్రేడువారికి నక్కఱలేకయుండుటచే దానిని విడిచిపెట్టితిని. ఈయంశమునుగుఱించి తెలుఁగులో నిదివరకెవ్వరును వ్రాసియుండకపోవుటచే నాంధ్రదేశీయులగు నుపాధ్యాయులందరు దీనినిమిగుల నాదరింతురని కోరెద. ఇది లోవర్ సెకండరీ, ప్రైమరీ గ్రేడులవారికేగాక అప్పర్ సెకండరీ గ్రేడ్ వారికి నయితము సహాయకారిగానుండునని నమ్మెద.

GUNTUR,
4th, April 1898.

M. H. SUBBARAYADU.

A MANUAL OF SCHOOL METHOD.

పాఠశాలాక్రమశిక్షాప్రదర్శిని.

రెండవభాగము.

క్రమశిక్షయు, నీతియు.

1. క్రమశిక్ష దానిప్రథమభాగములు.

Elements of Discipline.

క్రమశిక్షయనగా పాఠశాలాకార్యములు నెరవేరుటకును, బాలురు ఉపాధ్యాయునియొక్క అధికారమునకును పాఠశాలానిబంధనలకును లోబడి నడచుకొనుటకును, విద్యాకృషియందు శ్రద్ధయుంచుటకును, భావికాలమందు బాలురు సత్ప్రవర్తనకలవారై యుండుటకును, ఉపాధ్యాయుడుపయోగించు సాధనములకును, అట్టిసాధనములవలన కలిగినఫలితమునకును పేరు, బాలురకు సరియైనప్రవర్తనను కలుగజేయునట్టిగాని, కలుగజేయుటకు సాధారమగునట్టిగాని, అక్రమమును ఆటంకపరచునట్టిగాని, ఆటంకపరచుటకు సహాయకారియగునట్టిగాని, శక్తి లేక సాధనమునకు సయితము క్రమశిక్ష యని పేరు.

పాఠశాలయందు పనిచక్కగాజరుగుటకు ఆవశ్యకములగు క్రమము. శ్రద్ధ, విధేయత, జాగరూకత, పట్టుదల, మొదలైనవి సాధ్యమైనంతమట్టుకు క్రమశిక్ష వలననే కలుగును. పాఠశాలాకార్యములకు భంజకములగునట్టి అక్రమము, అశ్రద్ధ, అవిధేయత, అజాగ్రత, అలసట, మొదలైనవి చాలామట్టుకు క్రమశిక్షవలననే తొలగిపోవును.

(1) క్రమశిక్ష, దానినానార్థములు.

క్రమశిక్షకు నానార్థములుగలవు. కొందరు వినయమందురు. కొందరు తర్ఫీతు అందురు. మరికొందరు క్రమమునకు పేరందురు. ఇంకకొందరు లోబడినడచుకొనుటయందురు, శిక్షయనికూడనందురు. ఇంకకొందరు డ్రిల్ అందురు. మరికొందరు పాఠశాల

యందు సందడిలేకయుండుట అందురు. పదార్థమునుబట్టి క్రమశిక్ష యనుపదము ఇన్ని విధములుగా నొకవేళ నుపయోగింపదగియున్నను, పాఠశాలాక్రమశిక్షయనగా పాఠశాలయందు విద్య నిరాటంకముగా బాలురకలవడునట్లు కల్పింపబడిన సాధనములకును వాని వలన గలిగినఫలితములకును పేరు.

ఈక్రిందివి క్రమశిక్షవలన కలుగవలసినవైనను, కలిగినఫలితములైనను క్రమశిక్షయొక్క యంతర్భాగములుగా తీసికొనవచ్చును.

(1) విధేయత (2) శ్రద్ధ (3) చురుకుదనము (4) క్రమము (5) నెమ్మది (6) పరిశ్రమము (7) పాఠశాలకు దినముతప్పక సరిగావచ్చుట (8) పాఠశాలావేళకు సరిగా వచ్చుట (9) శుభ్రత (10) మంచిమర్యాదలు (11) సత్యవాదిత్వము (12) నీతి.

ఈయంశములన్నియు ఒకపాఠశాలలోని మంచిక్రమశిక్షకు నిదర్శనములుగా కూడనున్నవి.

(2) మంచిక్రమశిక్షవలనఁ బాఠశాలకుగలుగు ప్రయోజనములు.

(1) పాఠశాలాకార్యములన్నియు చక్కగాను సులభముగాను జరుగును.

(2) ఉపాధ్యాయుని సౌఖ్యమునకును నెమ్మదికిని మంచిక్రమశిక్ష అగత్యము.

(3) మంచిక్రమశిక్ష పాఠశాలయందున్నయెడల బాలురకు తృప్తికరముగా నుండును.

(4) మంచిక్రమశిక్షవలన క్రమపద్ధతి వాడుకపడుటయు నిబంధనలకు లోబడి నడచుకొనుటయు నలవాటగును. అందువలన క్రమపద్ధతికిని, మంచితర్ఫీదునకును ఆధారమగును.

(5) మంచిక్రమశిక్ష విద్యాభివృద్ధికిని సత్ప్రవర్తనమునకును సహాయకారి అగును.

(3) మంచిక్రమశిక్షయొక్క చిహ్నములు.

(1) పాఠశాలయందు సందడిలేకయుండుట.

(2) స్థలములు మారునపుడును పాఠములు మారునపుడును చురుకుదనము నెమ్మది కనబడుట.

(3) ఉపాధ్యాయుని యాజ్ఞలన్నిటికి వెంటనే బాలురు సంతోషముతో లోబడుట.

(4) బాలురందరు వారివారిపనిలో చాకచక్యము కలిగియుండుట.

(5) పాఠశాలయందు దొంగతనము అబద్ధము కాపీచేయుట మొదలైనవి లేక బాలురు మర్యాదగా నుండుట.

(6) శిక్షలుతగ్గియుండుట.

(4) క్రమశిక్షను చక్కగానుంచుటకై ఉపాధ్యాయునియం దుండవలసిన ముఖ్యయోగ్యతలు.

ఈక్రిందియోగ్యతలు ఉపాధ్యాయుని యందున్నయెడల ఆయన మంచిక్రమశిక్షకుడై బాలురందరిని తనవశముచేసికొని చక్కగాఁ బాలింపఁగలడు.

(1) బాలురు తననుసన్మానింపదగిన సుగుణసంపత్తిగలిగి నీతిగలవాడైయుండుట.

(2) నిశ్చితబుద్ధి మనోదార్ఢ్యము మొదలగుయోగ్యతలను కలిగియుండుట.

(3) పరిపాలించు సామర్థ్యమును గలిగియుండుట.

(4) ఇంద్రియనిగ్రహత్వము అనగా కోపాదులనణచుకొను సామర్థ్యము.

(5) ఘనోద్దేశము అనగా ఉన్నతస్థితియందలి యభిలాష.

(6) బాలురగుణాదికమును సాధారణముగా తెలిసికొను సామర్థ్యము.

(7) క్రమశిక్ష దానియుద్దేశము మొదలైనవానిని ఎరిగియుండుట.

(8) ఏసంగతినైనను సులభముగ గ్రహింపగలశక్తి.

(9) బోధనాశక్తి.

(10) వాక్కు, శ్రోత్రము, నేత్రము, వీనికిసంబంధించిన గుణాతిశయములు.

(11) ఇంగితజ్ఞానము

(12) బుద్ధిసూక్ష్మత.

(13) బాలురకుతగినట్లు నడచుకొనుసామర్థ్యము.

(14) వాక్పాటవము.

(15) ఏయంశమునందైనను రుచికలుగజేసి దానిని గమనింపజేసి తరగతిని సరిగా నుంచు సామర్థ్యము.

(16) మనోహారమగు గంభీరప్రవర్తన.

(17) అంశములయొక్క సంపూర్ణజ్ఞానము.

(18) తనయధికారమును తగినరీతిని ఉపయోగపరచు సామర్థ్యము.

(19) నిబంధనలు మొదలైనవానిని ఏర్పరచుకొనగలశక్తి.

(20) కంటిని, చేతిని, వాక్కును, చక్కగా నుపయోగింపగల సామర్థ్యము.

(౫) మంచిక్రమశిక్షకు నాధారభూతుఁ డుపాధ్యాయుఁడు.

కార్యకారణములు రెండునుజేరియున్నట్లు ఫలసాధనములు రెండునుకలసియున్న నీక్రమశిక్షకు ప్రధానకారణము ఉపాధ్యాయుఁడు. ఆయనశక్తియు, నీతిప్రవర్తనయు, ప్రేమ,సత్యత, న్యాయదృష్టి, శాంతము, వివేచనాశక్తి, మర్యాద, ఉత్సాహము,కార్యాసక్తి, నిష్పక్షపాతబుద్ధి, మొదలైన సుగుణసంపత్తియు మంచిక్రమశిక్షకు నాధారములు.

ఉపాధ్యాయుఁడు.

ఉపాధ్యాయునియొక్క ప్రవర్తనను బాలురు అవలంబింపజూతురు. ఆయనచెప్ప నక్కరలేకుండ బాలురుసైతము ఆయనవలెనడచుకొనుటకు నేర్చుకొందురు. ఆయనమంచి వాడుగానున్నట్లైన బాలురును మంచివారగుదురు, ఆయన సోమరిగానున్నయెడ బాలురు చురుకుగలవారుగానుండరు. ఆయన అబద్ధికుడుగా ప్రవర్తించునెడ బాలురు సత్యవంతులుగానగుట దుస్తరము. ఆయనశుచిగలవాడుగా నుండనియెడల బాలురుసైతము అశుచిగా నుందురు. ఇందువలన ఉపాధ్యాయుడు తానెట్టివాడైతే తనబాలురును అట్టివారేఅగుదురని తెలిసికొనవచ్చును. ఉపాధ్యాయు డెట్టివాడో పాఠశాలయునట్టిదిగానుండుననుు లోకోక్తియున్నది, సుగుణములుగాని దుర్గుణములుగాని ఏర్పడుటకు బాల్యము తగినకాలముగనుక అట్టి మంచికాలమందు తనపాలబడియున్న బాలుర పురోవృద్ధినిగురించి ఉపాధ్యాయుడు యోచింపడేని కలకాలము ఆయనవలన నెందరో నష్టము నొందుచుందురు. ఆయనరీతి,గుణము,నడవడి,పాలనావిధము. మొదలగునవి చక్క.గానుండెనేని బాలురు క్రమముగా శిక్షితులై యభివృద్ధినొందుదురు. ఉపాధ్యాయుడు ఒకవేళ దుష్ప్రవర్తన దుర్వాడుకలుగలిగి ఉన్నయెడల వానిని శీఘ్రముగ నివారించుకొని బాలురయెదుట సత్ప్రవర్తనతో మెలగవలెను. పాఠశాలయందెప్పుడేని లోపములు గాన్పించినయెడల వానికి గారణములను బాలురయందు జూడక తనవలన గలిగిన వనుకొని ముందుగా తనయందు జూచుకొనవలెను. పాఠశాలయందు సాధారణముగా అక్రమములుగలుగుట తనయందేదో లోపముచేతనేయని యూహించుకొను చుండవలెను,

క్రమశిక్ష కొంతమట్టునకు విద్యవచ్చుటకుకూడ సాధన భూతమగుటయేగాక పాఠశాలయందు మంచిస్థితిని మంచివాడుకలను కలుగజేయును. క్రమశిక్షకు వెంటనే కలుగు ఫలము విద్యావిషయికమగు కార్యములు నిర్విఘ్నముగా జరుగనిచ్చుటకే.

ఉపాధ్యాయుడు విద్యయందెంత గట్టివాడైనను బాలురు ఆయనచెప్పు దానిని గమనింపక సోమరితనముగానుండినట్లైతే లాభమేమిగలుగును ! పాఠశాలయంతయు

క్రమశిక్షలేక గందరగోళముగానున్న యెడల బోధ[illegible] వినపడక ప్రయత్నమంతయు వృధయగును. కాబట్టి ఊరక బోధించుటమాత్రము చాలదు. బోధింపబడిన దానిని బాలురు గమనించి నేర్చుకొనునట్లు చేయవలెను. అందుకై సరియైన క్రమశిక్ష ఉంటే నేతప్ప ఉపాధ్యాయునికి ప్రయాసములేకుండ మంచిపని జరుగనేరదు. మఱియు మంచి క్రమశిక్షవలన క్రమము, శ్రద్ధ, పరిశ్రమము, మనస్ఫూర్తిగా లోబడియుండుట, మంచివాడుకలు మొదలైనవి కలుగును.

(6) మంచి క్రమశిక్షకు అగత్యములగు కొన్ని బాహ్యసాధనములు.

ఇవి అంత అగత్యము కాకపోయినను మంచి క్రమశిక్షను వృద్ధిపరచుటకు కొంత మట్టుకు కారణములగును. అవి ఏవియనగా తగిన పాఠశాలాగృహములు, ఇరుకుగాని సంపుగాని లేకయుండుట, మంచిగాలి, వెలుతురువచ్చుచుండుట, తగినబల్లలు మొదలైనవి యుండుట, ప్రతితరగతి చాలినంతఎడముగా కూర్చుండుటకు తగినచోటు, మంచి పాఠశాలా ఏర్పాటులు, చక్కగా నేర్పరుపబడిన కాలనిర్ణయపత్రికయు, ఉపాధ్యాయుని కెదుట ఏకదృష్టిని కనుపడని తరగతులలో క్రమముగా పని జరుగునట్లుచేయుట అసాధ్యము. స్థలము ఇరుకుగాను బల్లలుకూర్చుండుటకు అనుకూలముగానివిగాను ఉన్నప్పుడును తగిన ఉపాధ్యాయులు లేనప్పుడును మంచిపని జరుగక గందరగోళముగానుండును, విశేషము చలి యెండ గలచోట్లను బాలురకు నలనటగాను ఆకలిగాను ఉన్నప్పుడును మంచిపని జరుగనేరదు. ఒకపాఠశాలయందలి ఏర్పాటులన్నియు విద్యావిషయములోగాని క్రమశిక్షలోగాని మిగుల నగత్యము. ప్రతిఉపాధ్యాయునికి తగినపని ఇవ్వవలెనుగాని హెచ్చుగానియ్యకూడదు. క్రిందితరగతులలో ఉపాధ్యాయునికి కష్టము హెచ్చుగానుండును.

(7) ఫలితమునుబట్టిచూడగా మంచి క్రమశిక్షయొక్క చిహ్నములు.

1. మంచిక్రమము.

పెద్దతరగతులలో నుపాధ్యాయుడు ముందుగా కలుగజేయవలసిన మొదటిసంగతి మంచిక్రమము, అదిలేనియెడల బోధనయే సాగదు, ఉపాధ్యాయునికి శ్రమయు వినుకు నుకలుగును.

2. గమనము, లేక, శ్రద్ధ.

ఇది మనస్సునకు కలుగు ఒకవిధమగు చాకచక్యమైనస్థితి. కొందఱు బాలురు చూచుచున్నను తమ మనస్సును ఆపనియందుంచరు. ఇంద్రియజ్ఞానమునకే గమనము అగ

త్యమైయున్నప్పుడు పరిశీలన మొదలగు మనోవృత్తులకు మిగుల నగత్యముకదా, కొంత మంది బాలురకు సహజముగా గమనము విశేషముగానుండును. మఱికొందరికి స్థిరముగా నుండక ఒకదానినుండి మఱియొకదానికి పరుగిడుచుండును.

ఈక్రింది సాధనములవలన కొంతమట్టునకు గమనమును నిలుపవచ్చును.

(1) జ్ఞానసంపాదనేచ్ఛ (2) చాకచక్యమందలి ఇష్టము (3) కనికరము (4) అంశముయొక్క ఉపయోగము (5) ఒకరిని మించవలయునను కోరిక (6) అంగీకారమందిచ్ఛ.

పైసంగతులు విద్యకు సంబంధించినవిగానున్నను తద్వారా క్రమశిక్షకును సంబంధించియుండును. పాఠము మనోహరముగానున్నప్పుడు బాలురందరు క్రమముగానుందురు. ఆటకంటె బోధింపబడు నంశము మనోహరముగా నున్నపుడు ఆడుకొనుటకు ఇష్టమును గలిగియుండరు. చాకచక్యమందు ఎక్కువసంతోషముండుటచే సోమరితనముగానుండఁ గోరరు.

3. పరిశ్రమము.

బుద్ధికుశలత పరిశ్రమము వీనిలో బాలునికి రెండవది మొదటిదానికంటె విద్యాభివృద్ధిని కలుగజేయును. రెండవది లేక మొదటిదియున్నను ప్రయోజనములేదు. రెండును ఉన్నప్పుడు చెప్పనే అక్కరలేదు. కాబట్టి ప్రతిఉపాధ్యాయుడును బాలురు జాగ్రతను కలిగియుండునట్లు చేయవలెను. పాటుపడుట జయమునకు గారణముగదా. బాలురందరు చదువునప్పుడు చదువునందును ఆడునప్పుడు ఆటయందును యావచ్ఛక్తి నుపయోగింపవలయును.

4. లోబడియుండుట.

ఉపాధ్యాయుని యాజ్ఞకు బాలురు వెంటనేలోబడి నడుచుకొనునట్లు అభ్యాసము చేయవలెను. దీనికి డ్రిల్లు సహాయకారిగానుండును. ఈక్రిందివి యీవిషయమై సూచనలుగానుండును.

(1) ఏమి ఉత్తరువుల నేర్పర్చవలెనో నిశ్చయించుకొని వానిప్రకారము ప్రవర్తింపుము.

(2) ముఖ్యమయిన వానిని కాకితముమీదవ్రాసి తరగతిలో నందరికి గనపడుచోట వ్రేలాడవేయుము. అవి విశేషముగా నుండకూడదు. వానినితరుచుమార్చకూడదు.

(3) నీవు జరిగింపలేని యాజ్ఞలనెప్పుడును ఇవ్వకుము.

(4) ఒక ఆజ్ఞనిచ్చినపిమ్మట బాలురు దానికిలోబడునట్లు చూడుము. దానికిలో బడువరకు మరియొక ఆజ్ఞనివ్వకుము.

(5) నీవిచ్చునట్టి యాజ్ఞను చెల్లింపతగినట్టి స్వరముతో జెప్పుము.

(6) నీయాజ్ఞలను పట్టుదలగలస్వరముతో జెప్పుము. అరవకూడదు దానినే మరల చెప్పకూడదు.

(7) ప్రతిపనికిని ఒక నిర్ణయమయినపద్ధతి నేర్పఱుచుకొనుము.

(8) పాఠములు మారునప్పుడు బాలునల్లరి చేయకుండునట్లు జాగ్రతను గలిగి యుండుము.

(9) నీతరగతికి ఏదియో యొకనిశ్చయమగు పనిని ప్రతిగంటకు నేర్పరచియుంచుము.

(10) నీయాజ్ఞలకులోబడి నడచుకొనవలసిన యగత్యమును బాలురకు తెలియప ఱచుము.

౫. మంచిస్థితి.

ఇది పాఠమునుబట్టిగాని బాలురయొక్క విద్యాతిశయమునుబట్టిగాని కలుగదు. ఇది ఉపాధ్యాయునివలనను బాలుర ప్రవర్తనను బట్టియు జూచువారికి తృప్తికరముగా గనపడునట్టి పాఠశాలయొక్క స్థితి.

6. మంచివాడుకలు.

ఇవి తాత్కాలికమునకే పనికివచ్చునవిగాక మంచివాడుకలు నిరంతరము ఉండవ లయును. క్రమము, వినయము, పనియందలిశ్రద్ధ, ఇట్టి సుగుణములెల్లప్పుడు ప్రయోజన కారులుగదా.

(8) మంచి క్రమశిక్షయుండుట కేమిచేయవలెను.

(1) క్రమశిక్ష నిరంతరము ఒకటేవిధముగ ఒకక్రమమునునరించి యుండవలెనుగాని ఒకదినమందు కఠినముగాను మరియొకదినమందు తేలికగానుండకూడదు. నీవు ఎట్టిక్రమ శిక్షను ఎట్టిక్రమపద్ధతిని బాలురవలన నిరీక్షింతువో అట్టులేనియెడల దానిఫలితమేమో బాలురకుఁ దెలిసియుండవలెను. ఒకసంగతి నేడు జరుగకపోయినను, నీవు ఊరకున్న యెడల రేపును ఊరకుందువని తలతురు. అట్లుగాక మరునాడు వారిని శిక్షించినయెడల అది నీయొక్క లోపముచే గలిగెనని వ్యసనపడుదురు. కాబట్టి నీవేర్పరచినపద్ధతులను అవ లంబించి నీవును ప్రవర్తింపవలయును. బాలురను అట్లు చేయునట్లొనర్పవలెను.

(2) క్రమశిక్ష స్వభావము ననుసరించియుండవలెను. బాలుర సహజగుణములకు విరుద్ధముగా నీయాజ్ఞలున్నయెడల అవి చక్కగా జరుగ నేరవు. బాలురు లోబడనియెడల అది ఉపాధ్యాయుని తప్పుగానుండును. ఉపాధ్యాయుడు బాలుర సహజజ్ఞానములను ఎఱిగి మరి యాజ్ఞాపింపవలెను.

(3) క్షమశిక్ష బలాత్కారముచే గలుగునదిగానుండకూడదు. సహజముగ బాలురు క్రమశిక్షను క్రమపద్ధతిని ఇచ్ఛయించియుందురు.

(4) క్రమశిక్ష దయతో కలసియుండవలెను. క్రమశిక్ష బాలుర స్వతంత్రాధికార భంజకమై నహేతుకముగానుండక పక్షపాతయుక్తమై ద్వేషబుద్ధితోకూడియున్నయెడల బోధకబోధ్యులకు పరస్పరానురాగముండదు.అదిలేనివాడు చక్కని ప్రేమయుండును,భయముకంటె ప్రేమ ఎంతో అనురాగమును అనుసరణను గలిగించును. క్రౌర్యమును క్రోధస్వభావమును ఎన్నటికి కారాదు. సౌజన్య స్వభావములేక శాంతాదిగుణములచే క్రమశిక్షను నిలుపలేనివారు కాఠిన్యమే యాధారమని తలంతురు.

(5) క్రమశిక్ష న్యాయముగానుండవలెను. కొందరియెడల పక్షపాతమును మఱి కొందరియెడల అన్యాయమును గనపరచక ఉపాధ్యాయుడు సర్వసముడై యుండవలెను.

(6) ఉపాధ్యాయుడు తనకుమర్యాద ఎట్లుకావలెననికోరునో అదేరీతిగా బాలుర యెడలను మర్యాదగానుండవలెను.

ఉపాధ్యాయుడు మోటువాడై బూతులుతిట్టుచున్నయెడ పాఠశాలకుఁ జెరుపుగ లదు. జనులయాచారములనుబట్టి వినయము మర్యాద మొదలైనవానిని నేర్పవలెను.

II క్రమశిక్షయొక్క యుద్దేశములు.

Aims of Discipline.

(1) క్రమపద్ధతి, శ్రద్ధ, విధేయత ఇవి క్రమశిక్షయొక్క ముఖ్యోద్దేశములు.

క్రమపద్ధతి.

క్రమపద్ధతియనగా ప్రతివస్తువును దానికి తగినస్థలములోనుంచుటయును ప్రతిపనిని యుక్తమైనకాలములో చేయుటయును. క్రమమును నిలుపుట అనునపుడు పాఠశాలయందు గాని మఱిదేనియందుగాని కొందరుకూడి ఏర్పరచుకొన్న పద్ధతియనియు నర్థమగును.

శ్రద్ధ.

శ్రద్ధయనగా మనమనస్సు ఒకపనియందు దానియంతటయది సంలగ్నమైనిలుచుట. ఆది మనస్సుయొక్క ప్రయత్నముచేతనిలిచి తలంపులను దృఢపరచును.

పరిశ్రమము.

పరిశ్రమమనగా ఒకపనిచేయుటకు ఉత్సాహముగలిగి పనిచేయునప్పుడెల్ల శ్రద్ధతో స్థిరముగాను క్రమముగాను పనిచేయువాడుక.

విధేయత.

విధేయతయనగా ఉపాధ్యాయులుగాని తల్లిదండ్రులుగాని పైయధికారులుగాని మనలను చేయుమనినపనిని తప్పకచేయుట.

వీనివిలువ. క్రమపద్ధతివలన.

(1) పని సులభమగును. (2) కాలముకలసివచ్చును, (3) జాగ్రత, పాటుపడుట మొదలైనవికలుగును, (4) జయమునకు మార్గమేర్పడును. (5) మంచిగుణములు బలపడును.

శ్రద్ధవలన.

(1) మనశ్శక్తులు దృఢపడును (2) బాలునికి విద్యాభివృద్ధికలుగును (3) శ్రద్ధ వాడుకయైనకొలది బాలుడు చక్కగా శిక్షితుడగును (4) పనిచేయువారికి పని సంతోషకరముగానుండును. (5) జ్ఞానసంపాదనేచ్ఛ, పరస్పరస్పర్థ, చాకచక్యము, మొదలగు సహజగుణములు వృద్ధిపడును.

పరిశ్రమమువలన.

(1) కష్టములు నివారణయై హెచ్చుపని జరుగును (2) విశేషసామర్థ్యము కలుగజేసికొనవచ్చును. (3) మనస్సునకు స్వతంత్రశక్తికలుగును. (4) పరిశ్రమచేసినపిమ్మట మనస్సునకు తృప్తికలుగును. (5) పురుషుడు విద్యా గౌరవములను సంపాదించుకొని సుఖించును,

విధేయతవలన.

(1) ఇంద్రియనిగ్రహత్వము అలవాటగును (2) విధాయకకృత్యములను చేయుటకు అలవాటుకలుగును (3) మంచిమర్యాదలు పట్టుపడును (4) పనిలో మనస్సునకు ని

మృదియుఁ తృప్తియుఁగలుగును (5) పురుషులు వ్యవహారములో క్రమక్రమముగా నభివృద్ధి జెంది మంచిస్థితికి వత్తురు.

వానిని మీరి నడచుకొనుటకు కారణములు.

1. క్రమపద్ధతి.
   (1) ఉపాధ్యాయునికి క్రమపద్ధతియందు పట్టుదలలేమి.
   (2) జరుగుటకు శక్యముకానంత కాఠిన్యము.
   (3) ఒక నియమములేక అక్రమముగా పనులుచేయుట.

2. శ్రద్ధ.
   (1) ఉపాధ్యాయుని అసామర్థ్యత.
   (2) అంశము మనోహరముగా నుండకపోవుట.
   (3) పాఠశాలయందు మంచి ఏర్పాటులులేమి.

3. పరిశ్రమ.
   (1) అంశము సుబోధముగా నుండకపోవుట.
   (2) ఉపాధ్యాయుని యాదరణలేకపోవుట.
   (3) అప్పుడప్పుడు కఠినమగు పనులనిచ్చి అలవాటుచేయకపోవుట.

4. విధేయత.
   (1) ఉపాధ్యాయునికి బాలురయందు ప్రేమలేకపోవుట,విద్యయందు శ్రద్ధతగ్గుట.
   (2) డ్రిల్లుమొదలగు సాధనములచే విధేయతను విశేషముగా వాడుక చేయకపోవుట.
   (3) బాలురస్వభావములకువిరుద్ధములును అశక్యములును అగునాజ్ఞల నిచ్చుట.

వానినివృద్ధిపరచు సాధనములు.

1. క్రమపద్ధతి
   (1) ఉపాధ్యాయుడేర్పరచిన మంచినిబంధనలు.
   (2) ఆనిబంధనలనువారికి తెలిపిక్రమపద్ధతిని బాలురునరిగా నాచరించునట్లుచేయుట.
   (3) ఆనిబంధనల ప్రకారము జరుగుచుండునట్లు ఉపాధ్యాయుడు కనిపెట్టుట.

2. శ్రద్ధ.
   (1) అంశముచక్కగా తెలియునట్లును మనోహరముగా నుండునట్లును చేయుట.
   (2) బాలురకు నిరంతరము పనికల్గ జేయుట.

(3) చాలసేపు శ్రద్ధనిలుపలేనట్టి బాలురను అధికముగా సాయాన పెట్టకపోవుట.

3. పరిశ్రమ

(1) మంచిశ్రద్ధను కలుగజేయుట.
(2) దేనినైనను నిదానముగా యోచించునట్లు చేయుట.
(3) పనిచేయుట యందు పట్టుదలగలిగి యుండునట్లుచేయుట.

4. విధేయత

(1) ఏర్పరచబడిన నిబంధనలను మీరినడవకుండునట్లు చేయుట.
(2) బాలుర స్వభావమునకనుగుణములై సాధ్యములగు మంచియాజ్ఞలనిచ్చుట.
(3) ఉపాధ్యాయునికి బాలురయందు ప్రేమయును తనపని యందిష్టమును కనపరచుట.

పైవానిలో క్రమపద్ధతియు శ్రద్ధయు మిగులముఖ్యము గనుక వీనినిగురించి ఈక్రింద విశదముగా వ్రాయబడి ఉన్నది.

క్ర మ ప ద్ధ తి.

మంచిక్రమపద్ధతి మంచిక్రమశిక్షయొక్క యొకఫలము. సరిగా ననుసరింపబడిన మంచినిబంధనల యొక్క పనివలన గలిగిన పాఠశాలాపని యొక్క అన్నివిషయములను నడపుటలోగల క్రమమైనపద్ధతికే క్రమపద్ధతియనిపేరు. అదియోచించి చేయబడిన యేర్పాటుగాని అరాత్తుగావచ్చునదికాదు. మంచిపాఠశాలలో ప్రతివస్తువునకు ఒకనిర్ణయమగు తావును ప్రతిమనుష్యునికితనకు నిర్ణయమయినవిధాయక కృత్యమును ప్రతివిధాయకకృత్యమునకు నిర్ణీతకాలమును తావును పద్ధతియునుండును. ఏర్పాటుచేయబడిన దంతయు దానిప్రకారము జరుగుచుండును.

లాభకరమయినపని క్రమపద్ధతిలేనిదే జరుగుటయశక్యము.

క్రమపద్ధతిలో కొంతలోపమున్నప్పుడు బోధన అధికారములేని బోధనగానుండును. పాఠశాలాపనియొక్క విలువ క్రమపద్ధతిననుసరించి యుండును. ఉపాధ్యాయునియొక్కయు బాలురయొక్కయు సుఖమును తృప్తియు మంచి క్రమపద్ధతినిబట్టి యుండును. అక్రమపద్ధతి, లేక అక్రమము బాధకరముగ నుండును. క్రమపద్ధతి సంతోషకరముగానుండును. బాలురనుసరిగా పట్టుకొనిరాకపోయినయెడల వారక్రమములోకి దిగుదురు, అయితే వారిమనస్సులలో మంచిక్రమమే కోరుచుందురు.

క్రమపద్ధతివిషయములో నీక్రిందివి సాధారణతప్పితములు.

(1) బిగువులేమి:—ఇదియనగా ఒకప్పుడు మంచిక్రమమును మరియొకప్పుడు దానినితగ్గించుటయు. ఇది సాధారణమయినతప్పు. అయినను దీనివలన ఒకప్పుడు పాఠశాలాపనిచెడును. బాలురకప్రీతిగలుగును.

(2) తగనికాఠిన్యము:—క్రమపద్ధతి ఒకదానికి సాధనమనియెరుగక అదేముఖ్యమనుకొని నిరంతరము అతికఠినముతో క్రమమునుతప్పనీయకయుండుట. కావలసినసరియగుపని జరుగుచున్నప్పుడు తక్కినబయటి సంగతులను ఉపాధ్యాయుడు ఉపేక్షచేయవచ్చును. ఒకబాలునికి లెక్క వేయునప్పుడు కాళ్లాడించుటవాడుక యనుకొందము. అతడట్టిసమయములో కాళ్లాడించుటయందు కొంతశ్రద్ధనిచ్చుటచేత యావత్తుశ్రద్ధను లెక్కకివ్వనేరడు. దానినిక్రమమునకు తేగోరునట్టి యుపాధ్యాయుడు తనగమనమంతయు నప్రధానమగుబాలుని కాలియందేయుంచినయెడల ప్రధానమయినసంగతి ఉపేక్షింపబడును గదా. అందువలన నుపాధ్యాయుడు శాంతస్వరముతో నొకటిరెండుసార్లు అట్లుచేయుట కూడదని మందలించుటవలన క్రమపద్ధతికి తేవలసినదేగాని అంతకంటె విశేషశ్రద్ధతీసికొననక్కరలేదు.

(3) అక్రమము:—ఇదియనగా పట్టుదల లేక క్రమపద్ధతియందు బిగువులేమి.

(4) స్తబ్ధత లేక ఊరకుండుస్థితి:—మంచిచాకచక్యముతో క్రమముగాజరుగుటకు బదులుగా నేదియైనను మాంద్యముతోనూరకుండుట.

(5) అల్పత్వము:—పిచ్చిసొగసుగల అనగత్యమగు సూక్ష్మభేదములను గమనించుచు నిష్ప్రయోజనమగు నాజ్ఞలనిచ్చుట. ఒకమంచితరగతిలో ఒకలెక్క చేసినపిమ్మట పలకలను కనుపర్చుడని యాజ్ఞాపింపవలెనంటే బాలకులారా గమనింపుడు పలకలనుచూపుడు అని చెప్పి అట్లు చేసిరేమో కనుగొనుటకై తరగతినంతను ఒక్కసారి చూచినట్లైతే చాలును. మూడునాలుగు సెకనులలో ఈపనిజరుగవచ్చును. కొన్నిచోట్ల నుపాధ్యాయులు ఇదేపనికి ఈక్రిందియట్లు పదిపన్నెండు ఉత్తరువులనిచ్చెదరు. ఎట్లనగా పనినిలపండి. బలపములు క్రిందనుంచుడు. చేతులను క్రిందకువాల్చుడు. పలకలను పైకిఎత్తుడు. పలకల నుసిద్ధముగానుంచుడు. చేతులుపలకక్రిందకుపట్టుడు. పలకలనువంచుడు. ఇపుడుకనపరచుడు. ఇదియంతయు వట్టికాలహరణము.

(6) దూరదృష్టియు ముందుఏర్పాటును లేకపోవుట.

మంచిక్రమపద్ధతియొక్క చిహ్నములు.

(1) అది వాడుకగానుండును (2) అదితప్పక జరుగునని కనపడును. (3) అది దానియంతట వచ్చునట్లుకనపడును (4) దానినిగురించి ప్రశంసించుటగాని అడావుడిగాని లేకయుండును (5) అది తెలివితోజేరియుండును (6) అది తెలివిగలబాలుర తెలివికి కనపడుచుండును (7) బాలురు దానియుద్దేశము నెరిగి మెచ్చుకొనుచుందురు (8) అది ఏలోపమును లేక పూర్తిగానుండును.

పాఠశాలకును దానిపనికిని సంబంధించిన ప్రతిసంగతి ఏర్పాటైయుండవలెను. వానిలోనీక్రింద జెప్పబడిన మూడును ముఖ్యములు.

1. పాఠశాలాస్థానము.

ఎక్కడజూచినను శుభ్రముగానుండవలెను. ప్రతివస్తువు దానికి నిర్ణయమగు తావులోనుండవలెను. బోధనోపకరణములన్నియు ఒకపద్ధతి ననుసరించి అక్కడక్కడ క్రమముగానుండవలెను. ప్రతితరగతికి కావలసినపటములు మొదలైనవి అందు బాటులోనుండునట్లు క్రమపద్ధతిగా నొకచోటనుంచబడి యుండవలెను. సులభముగా తీసికొనేటట్లు పటములు గోడలకు వ్రేలాడవేయబడవలెను. తరగతియెదుట పటమువేసి కనపర్చుటకై ఏదోఒకఏర్పాటుండవలెను. నల్లబల్లపై వ్రేలాడవేయుట మంచిదికాదు. అట్లుచేసినయెడల పాఠమందు నల్లబల్ల నుపయోగించుటకు వీలుండదు. ఈజల్ మీదవేయుటకంటె తరగతి ఎదుట క్రిందనో బల్లమీదనో వేయుటమంచిది. పటములు మొదలయినవానికి సాధారణ మరమ్మతులున్నయెడల ఎప్పటివప్పుడు చేయబడుచుండవలెను. నల్లబల్ల సీమసున్నము తుడుపుగుడ్డ సిద్ధముగానుంచవలెను. తరగతికి కావలసిన క్లాసుపుస్తకములు అనుకూలమైనతావులో నుంచబడవలెను. తరగతిబాలురనందరిని వారివారి పుస్తకములను తెచ్చుకొనునట్లు చేయవలెను. కాపీపుస్తకములు ఎక్సర్‌సైజు పుస్తకములు జాగ్రతగా ఒకవరుసగానుంచవలెను. తీసికొండని తరగతిమధ్యను త్రోసివేయకూడదు. ఉపయోగింపబడిన తరువాత కలములను తుడిచివేయవలెను. ఇందుకై కొందరు ఒకగుడ్డను వ్రాతబల్లకు కట్టియుంతురు. మరికొందరు ఒకబాలునిచేతికి గుడ్డనిచ్చి తుడుచుటకు బంపుదురు. బలపములు పోగొట్టుకొనుటచేత తరగతిలో పనికి తొందరకలుగును. పలకబలపము బాలురు తెచ్చుకొనునట్లు చేయవలెను. లేదా ఉపాధ్యాయుడే సిద్ధముచేసియుంచవలెను. క్రమముగా పని జరుపుటకు శిరాబుడ్లు అగత్యము. ఇది స్వల్పసంగతియని తలపరాదు. సిరామంచిదిగాను, చాలినంతగాను, లేనియెడల వ్రాతపుస్తకములు చెడిపోవును. సిరా

బుడ్లును వానిలో సిరాయును చాలినంతగాలేనియపుడు బాలురు ఇతరతరగతులకు పరుగెత్తి తొందరకలుగచేయుచుందురు. బుడ్లలో సిరా నిండాపోసినయెడల ప్రమాదమువలన ఒలికినపుడు బల్లలు, బాలురగుడ్డలు, పుస్తకములు, మొదలయినవి చెడిపోవును. ఇవియన్నియు నందరికి తెలిసినసంగతులేగాని కొందరు ఉపాధ్యాయులు వానిని గమనించుట తమ గౌరవమునకు తగినపనికాదని తలంతురు.

బాలురాడుకొనుతావు సైతము చక్కగాతుడిచి శుభ్రముగానుంచవలెను. గోడలు మొదలయినవానిమీద అక్షరములుగీతలు మొదలైనవి వ్రాయనీయగూడదు. ఎప్పుడైనను వ్రాతకనపడినయెడల దానిని వెంటనే చెరిపివేయించవలెను. బాలురగొడుగులు చెప్పులు మొదలయినవి జాగ్రతగానుంచుకొనుటకు ఒకతావు ఏర్పరచబడి యుండవలెను. బాలు రొకచోటనుంచి మరియొకచోటికి పోవలసినపుడు వరుసగా ఉపాధ్యాయుని యాజ్ఞమీద కవాతుచేయునపుడు నడచునట్లు వెళ్లవలెను. బాలురను త్రోయుటయు తోకుటయు మంచిదికాదు,

2. బాలురు.

బాలురందరు మంచిగుడ్డలతో సొగసుగాను శుభ్రముగాను కనపడవలెను. ఆలస్యముగా వచ్చువారివల్ల పనికిని క్రమమునకును తొందరలేకుండునట్లు అందరు వేళకువచ్చునట్లుచేయవలెను. వైఖరిలో చాకచక్యముగాను అయితే నిదానముగాను బాలురు కనుపడవలెను. మోటుతనము, తొందర, అలక్ష్యము, మొదలైనవికనపడగూడదు.

3. ఉపాధ్యాయులు.

ఉపాధ్యాయులు పాఠశాలా నిబంధనలకు బాలురు లోబడునట్లుతామును లోబడి నడుచుకొనవలెను. పాఠశాలా వేళకుముందు ప్రతిసంగతిని క్రమపద్ధతి ప్రకారమేర్పరచిపాఠశాలా వేళయందు తగినపని జరుగునట్లు చేయవలెను. బాలురుపాఠశాలా నిబంధనలన్నియు చక్కగా నెరిగియుండునట్లును, వాని ప్రకారము నడచుకొనునట్లును చేయవలెను. మంచి పాఠశాలలో నివియన్నియు చక్కగాగనపడుచు, చూచువారికిమనోహరముగా నుండును.

క్రమపద్ధతి యుండునట్లు చేయుటకు.

ఉపాధ్యాయుడు తనపాఠశాలలో మంచిక్రమపద్ధతియుండవలెనని దృఢీకృతచిత్తుడైయున్నపుడు ఈక్రిందిమూడు సంగతులును ముఖ్యములు,

(1) ఉపాధ్యాయునిచే నేర్పరుపబడిన మంచినిబంధనలు.

(2) మంచిక్రమపద్ధతినిగూర్చి వారాచరింపవలసిన సంగతులు పూర్వమే నిబంధనల మూలకముగా నెరిగియుండుట.

(3) ఉపాధ్యాయుడు జాగ్రతగాకనిపెట్టుచు బాలురానిబంధనలను మీరకుండునట్లు చేయుట.

శ్రద్ధ.

శ్రద్ధయనగా మనమనస్సు కాని యింతటబుద్ధి ఒకపనియందు సంలగ్నమైనిలుచుట, అది మనస్సుయొక్క ప్రయత్నముచేత నిలిచితలంపులను దృఢపరచును. బాలుడు శ్రద్ధతో గమనింపని యెడలవానికి లాభమేలేదు. క్రమపద్ధతికంటె శ్రద్ధమిగుల యగత్యము. శ్రద్ధవలనమనశ్శక్తులన్నియు మంచిస్థితిని పొందును, అదిలేనినాడు అవి మఱియొక విధముగా అంతవికాసమును పొందవు. జ్ఞాపకశక్తిమీదజరుగుపనియంతయు శ్రద్ధననుసరించియుండును. బోధనలో మనముముందుగా జూడవలసినది శ్రద్ధయే. శ్రద్ధనిలుపుటలో కష్టమనేక కారణముల ననుసరించియుండును. వానిలోనీక్రిందివి ముఖ్యమైనవి.

(1) మనోదౌర్బల్యము. దీనివలన బాలుడు తనతలంపులను స్వాధీనపరచుకొనలేకను ఇతరసంగతులకుపోకుండ చేయలేకపోవుటచేతను తనమనస్సును ఒకటేఅంశమునందు నిలుపజాలడు.

(2) మొండితనము. బాలుడు ఉపాధ్యాయుడు చెప్పునట్టి సంగతియందుగాక మఱియొకదానియందు శ్రద్ధనుకలిగియుండుటకు మూర్ఖపుపట్టు పట్టియుండును.

(3) శ్రద్ధగానుండుటవలని ప్రయోజనమును బాలురెరుగక యుండవచ్చును. మన బోధనవలన కలుగులాభము వారెరుగకయుందురు.

(4) బాలురు శ్రద్ధగానున్నట్లు కనపడుటచే ఉపాధ్యాయులు మోసపోవచ్చును.

(5) ఉపాధ్యాయులు చెప్పునట్టిఅంశము బాలురు గమనించునంత మనోహరముగానుండకపోవచ్చును.

శ్రద్ధను నిర్ధారణచేయునట్టిస్థితులు లేక షరతులు.

శ్రద్ధయనునది మనస్సునుబట్టి యుండునట్టియు దానియంతట యదిజరుగునట్టియు నొకపని. కాబట్టి గమనముంచునట్లు చేయుసాధనము మనస్సుమీద తగినరీతిని పనిజరుపుటనుబట్టి యుండును. మనము ఏపనినైనను సంతోషముగలుగుచున్నయెడలగాని, అదికలుగునను నమ్మకమున్నయెడలగాని, అది చేయకపోయినయెడల ఇబ్బందియున్నయెడలగాని,

ఆపనినిచేయుదురు. ఆ దేరీతిగా చేయుచున్న పని బాలునిమనస్సునకు మనోహరముగా న్నపుడు తనశ్రద్ధనంతనిచ్చును. పనియసహ్యముగా నున్నపుడు శ్రద్ధనిలుపుటయందు కష్టముకలదు. ఒకకథనుచెప్పునపుడు బాలుడు శ్రద్ధతోవినును. క్రియలనుగురించి బోధించునపుడు బాలుడు సులభముగాగమనింపడు. గనుక ఉపాధ్యాయునికి కొంతశ్రమగలదు. కాబట్టి ఉపాధ్యాయునికి శ్రద్ధనునిలుపునట్లుచేయు నేర్పు ఉండవలెను.

శ్రద్ధను అలవాటుపఱచుట.

శ్రద్ధను నిలుపునట్టివాడుక క్రమశిక్షలో మిగులముఖ్యమైనది. ఒక్క పాఠశాలయందేగాక శ్రద్ధ జీవితకాలమంతయుందును అన్నిపనులకును అగత్యము. పనిచేయుసామర్థ్యము శ్రద్ధను నిలుపుశక్తినిపట్టియుండును. శ్రద్ధ నిలకడగా ఎడతెగకయుండునట్లు చేయుట మిక్కిలియుకకష్టము. శ్రద్ధను విరామములేక నిలుపువాడే మేధావంతుడును అప్రమత్తుడును నిరయునగును. బాలుర శ్రద్ధగలిగియుండునట్లు తర్ఫీతుచేయబడవలెను. మనస్సును నిలుపుశక్తి వికసింపజేయవలయును. మొదట బాలుడు విశేషము పరధ్యానముకలిగియుండును. ఒకదానిని గమనించునపుడు చీమ చిటుక్కుమన్నను ఆవైపునకు మనస్సు ఆకర్షింపబడును. అందువలన విశేషము వాడుకపడితే నేతప్ప శ్రద్ధనిలువదు.

ఈక్రింది సంగతులను గమనింపవలెను.

(1) మనస్సులు సహజముగా వేరువేరువిధముగానుండును. అందువలన వానిని వేరువేరువిధముగా కనిపెట్టవలెను. చురుకులేని మనస్సును విశేషము ఉద్రేకకారణముల చేత మేలుకొలుపవలెను. దృఢముకాని మనస్సునకు వేగముగా శ్రద్ధకలుగజేయవచ్చును గాని అది నిలువదు. చురుకైన మనస్సుకు వెంటనే శ్రద్ధ కలుగజేయవచ్చును. గంభీరమైనమనస్సు విరామములేని శ్రద్ధను నిలుపగలదు.

(2) సహజశక్తులు భేదపడియుండును. కొందరికి మనస్సు ఏకదీర్ఘధ్యానముగా నిలుచును. మఱి కొందరికి కొంచెమున్నైనను నిలుపుట కష్టముగానుండును.

(3) ఉపాధ్యాయుని పద్ధతుల ననుసరించి విశేషముగానుండును. పసిబాలుర శ్రద్ధ వారిస్వాధీనములోనుండదు గనుక వారికి చెప్పునట్టియంశములు మిగుల మనోహరముగా నుండవలెను. శ్రద్ధ సులభముగానుండవలెను. కొంచెము సేపే కొద్దిసంగతులయుండే యుండవలయునుగాని చాలసేపు కఠినాంశములయుందుంచరాదు. శ్రద్ధావిషయికమగు పనులను తిరిగితిరిగి యిచ్చి శ్రద్ధ అలవాటుపడునట్లు చేయవలెను.

శ్రద్ధకువిఘ్నములు.

కొన్నిసంగతులు బాలురకు శ్రద్ధకలుగకుండ నాటంకపఱచును. మఱికొన్ని కల్గిన శ్రద్ధను వేరుసంగతులపై నాకర్షింపబడునట్లుచేయును. శ్రద్ధకు విఘ్నములగు పరధ్యానములకు కారణములు లోపలనుండిగాని బయటనుండిగాని కలుగవచ్చును.

1. బాలుడు.

బాలురలో ననేకభేదములుండును. ఒకనివిషయమై శ్రద్ధనుకలుగజేసిన సాధనము మఱియొకని విషయములోపనికిరాక పోవచ్చును. ఒకబాలుడు మందుడుగాను సోమరిగాను నుండును. మఱియొకడు తెలివిగానుచురుకుగాను నుండును. ఇద్దరిని ఒకేవిధముగ జూచుట అసంగతము.

2. ఉపాధ్యాయుడు.

ఉపాధ్యాయుని అక్రమములవలనను అక్రమపుపద్ధతులవలనను బాలురకు శ్రద్ధలేకయుండవచ్చును. ఉపాధ్యాయునికి ఆసక్తిలేనపుడును పాఠమును మనోహరముగా జేయలేనపుడును సామాన్యముగా సామర్థ్యములేనపుడును బాలురు శ్రద్ధగలిగియుండరు. తానుతొందరగాను ఆడావుడిగాను పాఠముజరుపుటచే మనోహరముగా లేకపోవుటచేత బాలురు శ్రద్ధను నిలుపజాలరు. ఉపాధ్యాయుని పద్ధతిలోను భాషలోను వేషములోను అభినయములోను కొంతవింతయున్నప్పుడు బాలురశ్రద్ధబోధింప బడునంశమునుండి అవింతకైపోవుచుండును.

3. పాఠము.

పాఠము మనోహరముగా లేనియపుడు బాలురుదానిని గమనించియుండరుగదా. ఉపాధ్యాయుడు చెప్పునట్టిపాఠము రుచిలేని యంశముగానున్న యెడలను దానిలో ప్రతిభాగము మనోహరముగాలేని యెడలను శ్రద్ధనిలువదు.

4. పాఠశాల.

పాఠశాలాఏర్పాటులలో లోపములున్నయెడల శ్రద్ధ చక్కగానుండదు. క్రమశిక్షలోపములు గలదిగాను క్రమపద్ధతిబలహీనముగాను ఉన్నయెడల శ్రద్ధయు లోపముగానే యుండును. భవిష్యజ్ఞానమును పైవిచారణయు చాలనపుడు బాలురయు శ్రద్ధకు ఉపాధ్యాయులు జవాబుదారీగానుండవలెను.

౨. ఇతర స్థితులు.

ఇతరస్థితులుకొన్ని బాలురను అశ్రద్ధగలవారినిగా చేయును. బలహీనత, మిగుల చలియు, అధిక వేడిమియు, ఇంటివద్దతగ్బితులోపములు, మనఃపరిశ్రమకోరునట్టి యొక పాఠమైనపిమ్మటకలుగునట్టి యలసట, ఉపాధ్యాయుడు శిక్షించునన్న భయము, ఇవియన్ని యు నశ్రద్ధకుకారణములు.

గమనమును నిలుపుటకు సాధనములు.

శ్రద్ధ మనోహరముగానుండునట్లు చేయవలయును. అశ్రద్ధమనోహరము గానిదిగా చేయవలయును. బాలురకు ఏదిఇష్ట మోదానియందు శ్రద్ధనునిలుపగలరు. ఇష్టమునుపుట్టించితిమేని శ్రద్ధయుదానితో కూడకలుగును. పాఠము మనోహరముగా నుండునట్లు చేసి బాలురకు దానియందిష్టమును పుట్టించి శ్రద్ధనుగలిగి యుండునట్లు చేయువలయును. పాఠములోని రమ్యత బోధనకు ప్రాణమువంటిది. కాబట్టి పాఠములోరుచిపుట్టించుటయే ఉపాధ్యాయుని మొదటిపని అదిలేనియెడల జయముకలుగదు. అందువలన నుపాధ్యాయుడీవిషయమును చక్కగా యోచించి మంచి యుపాయములను ఏర్పాటుచేసికొనవలెను. వేరువేరు పాఠములయందు వేరువేరు పద్ధతులవలన గలుగుఫలితమును బట్టి చూచుచుండవలెను. బాలురయెడల మనకుగల ననుభవమునుబట్టి మంచిమంచిపద్ధతుల నేర్పాటుచేసికొనవలెను. అనేకమంది బాలురుగల యొకపాఠశాల ఉపాధ్యాయునికి చదువుకొనుటకు ఉత్తమగ్రంథమువంటిది, మనబాల్యములో మన మెట్లుంటిమో మన కేయంశములు మనోహరములుగానుండెనో కొంచెము జ్ఞప్తికి తెచ్చుకొని యోచించినయెడల నదిమంచిసహాయముగానుండును. బాలు రశ్రద్ధగానున్నచో దానికారణములు కనుగొనుచు దానికి నివారకము లగు కారణములను యోచించుచు పట్టుదల గలిగియున్నయెడల ఫలముగలుగును.

మంచి శ్రద్ధను గలుగజేయుటకై ఈక్రిందియంశములను గమనింపుము.

(1) అంశము బాలురకు తెలియునట్లుచేయుము.

(2) బాలురకు గల జ్ఞానసంపాదనేచ్ఛను ఉపయోగింపుము. ఏఅంశమైనను వింతగా గనపడునట్లు చెప్పినయెడల శ్రద్ధగలుగును. తెలివిగల ఉపాధ్యాయుడు సాధారణాంశములనుచెప్పుటయందు సైతము ఆశ్చర్యమును ఆనందమును కలుగజేయును.

(3) బాలురకు నిరంతరము పని గలిగియుండునట్లు చేయుము. వారికి పని లేనియెడల అక్రమమును అశ్రద్ధను అలవాటుచేసికొందురు. బోధనాపద్ధతులు మంచివిగాకపోయినను ఈఅంశము గమనింపబడినచోట్ల మంచిపనిజరిగి మంచిలాభముకలిగెను,

(4) చేయుపని యనుభవమునకువచ్చునట్టిదిగా నుండనిమ్ము. బాలురు చేయుపని వారికి ఉపయోగకరముగా నుండునని వారికి స్ఫురించునట్లును శ్రద్ధగానుండుటలాభకారి యని తలంచునట్లును చేయుము. నోటి లెక్కలు మొదలైనవి ఇంటి పనులు మొదలైనవాని కన్నిటికి పనికివచ్చును. వ్రాత వ్యవహారములోనికి పనికివచ్చునట్లు అలవాటుచేయుము. అందుకై ఉత్తరములు మొదలైనవానిని వ్రాయించుము. జ్ఞానము మేలైనదని బాలురకు తోచినయెడల దానికై పాటుపడుటకు వారి కిష్టముండును.

(5) బాలురకు లాభముగలిగి జయము కలుగునని తోచునట్లుచేయుము.

(6) బాలురను శ్రద్ధవిషయమై నధికముగా నాయాసపెట్టవద్దు. పాఠ మెంతమనోహరముగానున్నను విశేషకాలము జరిగింపకూడదు. అలసటకలిగినట్లు తోచినతోడనే దానిని నిలుపవలెను.

(7) బాలుర శ్రద్ధను ఆకర్షించునట్టి ఇతరసంగతులను కనపడనీయకుము. సాధ్యమైనంతమట్టుకు శ్రద్ధకు విఘ్నములగు సంగతులను దూరముగానుంచుము. ధ్వనులు తమాషాలు మొదలైనవి బాలురకు కనపడకుండునట్లు మంచిఏర్పాటులను చేయుము.

(8) మనోహర మగుబోధనకు సహాయకారులుగా నుండు నుపాయములను ఉపయోగింపుము. ప్రశ్నలను పలువిధములుగా నడుగుము. జవాబుచెప్పగలవారి నందరిని చేతులెత్తుమను మందుము.

(9) సరిగా జవాబుచెప్పిన బాలుని చెప్పలేనిబాలురపైకి పంపుచుండుము. మార్కులివ్వవలసినచోట్ల నిచ్చుచు తగ్గింపవలసినచోట్ల తగ్గింపుము. ఆయాసంగతులనుబట్టి ఎట్టియుక్తు లుపయోగింపవలెనో ఎంతవఱ కుపయోగింపవలెనో తెలిసికొనుము.

(10) పాఠమందు నీకుగూడ రుచికలిగియున్నట్లు కనపరచుము. పాఠమువలన నీవుకూడ నానందించుచున్నట్లును సంతోషముతో పనిచేయుచున్నట్లును కనపరచుము. ఇష్టముండి పాటుపడిన యెడల జయముకలుగకమానదు.

అశ్రద్ధ కూడదనుటనుగురించి.

శ్రద్ధకు మంచిసాధనము పనిలోనియక్కరయనియు, రుచిని పుట్టించుట పని మనోహరముగా నుండునట్లు చేయుట యనియు నిదివరకు చెప్పియున్నారముగదా. అయితే ఈయుపాయమునకు సహకారియగు నింకొకసంగతిగలదు. అదేమనగా శ్రద్ధ విధాయకకృత్యము. పాఠము మనోహరముగానున్నను లేకున్నను బాలురు శ్రద్ధతోగమనించునట్లు చేయుటకు

మనకు హక్కు కలదు. ప్రతిపాఠమును ప్రతిభాగమును మనోహరముగా నుండునట్లు చేయుట కొన్నివేళల నశక్యముగా నుండవచ్చును. బాలురు గమనించునట్లు చేయుటకు నిరంతరము మనోహరత్వమును లంచమిచ్చుచుండుట కేవలము మంచిదిగాదు గదా. విద్యాసంపాదన మునకై రాజులకుదగిన సున్నితములగుమార్గములు లేవు. కఠినపరిశ్రమలచేతనే విద్య యలవడును. మఱియు వింతగానుండునట్లు ప్రతిసంగతినిమార్చి బాలురకు సుబోధముగా నుండునట్లు చేయునప్పటికంటె గట్టి మనఃపరిశ్రమచేయించునపుడు మనోవికాసము అధికముగా కలుగును. అంశము అసహ్యముగానున్నపుడు దానిని నిలిపివేయుటచే దానియందు అసహ్యము వృద్ధియగును. ఒకబాలునికి వ్యాకరణపాఠమందు ఇష్టములేనిచో దానిని నేర్పకుండుటకంటె బాలుడు దానియందు గమనింపనియెడల శిక్షింపబడు నని తెలియజేయుట యుత్తమపద్ధతి. దానియందు శ్రద్ధయుంచనియెడల అంతకంటె అసహ్యమగుశిక్షను అనుభవింపవలసివచ్చునని కనపరచవలెను. దీనివలన పాఠమందు శ్రద్ధయుంచుట విధాయకమని బాలురకుదోచును. అశ్రద్ధను కొంతమట్టుకైనను మానుకొందురు. ఉపాధ్యాయుడు తన యావచ్ఛక్తి నుపయోగించి శ్రద్ధ మనోహరముగానుండునట్లు చేయవలెను. విధాయక కృత్యము లన్నియు మనోహరములుగానుండవు. గాన వానిని గమనించునట్లు బాలురను బలవంతపెట్టవచ్చును. విధాయకకృత్యమును నీవల్లనైనంతమట్టుకు రమ్యముగానుండునట్లు చేయుము. అట్లు లేనియెడల ఎట్లైనను నాకృత్యమును గమనించునట్లు నెరవేర్చుము.

(2) సత్యవాదిత్వము, యోగ్యత, దయ, శుభ్రత, క్రమానుసరణము, సమయపాలనము లేక నియమితసమయము తప్పమి, వీనిముఖ్యతయు, వీనిని వృద్ధిపరచు నాధారములును.

సత్యవాదిత్వము.

సత్యవాదిత్వ మనగా నిజమునుచెప్పునట్టి వాడుక. నిజములో కొంతభాగమును దాచిపెట్టి కొంతభాగమును చెప్పుట కూడదు. జరిగినదానివాస్తవముకంటె అతిశయముగాను చెప్పగూడదు. దీనిముఖ్యతను సూచించుటకై న్యాయసభలయందు చేయబడు ప్రమాణములును సత్యము తప్పనందుకు సత్యహరిశ్చంద్రుడు లోనగుపూర్వులు పొందిన కీర్తియు ఇపుడు సత్యవంతులుగానున్నవారికి గల్గుచున్న గౌరవమునుగురించి కొంతచెప్పబడవలయును. బాలురవలనగలుగు నబద్ధములను నివారించి నిజము చెప్పునట్లు చేయుటచేత

సత్యవాదిత్వము అలవాటగును. అబద్ధము లాడుటవలన గలుగునష్టములను సూచించుచు పరిహాసమునకై పులి పులి యని అఱచినబాలుని కథను చెప్పవలెను. అన్నిజాతులలోను అబద్ధము చెప్పువానిని ఎంతహీనముగాజూతురో చెప్పవలెను. మనజ్ఞానము యావత్తు ఇతరులమాటలయొక్క నిజమును నమ్మియుండుటచేత గలుగుచున్నది గనుక అబద్ధములాడిన ఎంతనష్టమో సూచించుచు, భూగోళమును, చరిత్రను, వ్రాయువారు, నిజము వ్రాయక పోయిన నెంతబాధగలదో దృష్టాంతముగా జెప్పవలెను.

యోగ్యత.

యోగ్యతయనగా మనకు హక్కులేనివస్తువులను తీసికొనకుండగాని దానిని ఉపయోగించుకొనకుండగాని యాటంకపరచునట్టి భావములేక చిత్తవృత్తి. దొంగిలించినను మోసముచేసినను ఒకనిదగ్గిర అప్పుతీసికొని మరల నివ్వలేకపోయినను ఇతరులసొత్తును మనము ఉపయోగపరచుకొనినను అది అయోగ్యతఅవును. ప్రవర్తనలోను గుణములలోను యోగ్యాయోగ్యతలు గలవు. నీతిని బోధించుటచేత తల్లిదండ్రులును ఉపాధ్యాయులును నీతిగా ప్రవర్తించుటచేతను యోగ్యతను అలవాటుచేయవచ్చును.

దయ.

దయయనగా ఇతరులకు మంచిచేయవలెనను స్వభావము. మనము కార్యములలోను, మాటలలోను, దయను కనపరచవచ్చును. ఇతరుల కష్టసుఖములనుగురించి మనముకూడ వారివలె భావించుటచేతను ప్రేమగానుండుటచేతను కనికరము కనపరచుటచేతను కావలసినపుడు సహాయము చేయుటచేతను, భూతదయాళుత్వముచేతను దయనుకనపరచవచ్చును. ఉపాధ్యాయుడీసంగతులను బాలురకుబోధించి అట్లుప్రవర్తించునట్లు చేయుటచే నీగుణము వృద్ధియగును.

శుభ్రత.

శుభ్రతయనగా మనశరీరములను మనకుసంబంధించిన వస్తువులను మురికికాకుండ ఉంచుకొనువాడుక. ఉపాధ్యాయుడు ముందుగా మానవదేహమునుగూర్చియు ఆరోగ్యమునుగూర్చియు కొంతముచ్చటించి దేహమును గుడ్డలను మురికిలేక శుచిగానుంచుకొనవలసినముఖ్యతను చెప్పవలెను. స్నానముచేయుట మంచివస్త్రములను ధరించుకొనుట మొదలగు శుచిగలవాడుకలను బాల్యమునుండి యలవాటుచేసినయెడల అందము శుభ్రత అలవాటుపడును.

క్రమానుసరణము, సమయపరిపాలనము.

క్రమానుసరణమనగా ప్రతిసంగతిని నిర్ణయమైనరీతిని తప్పక చేయుట. సమయపరిపాలనమనగా ప్రతిపనిని నిర్ణీతకాల మతిక్రమించకుండునట్లు చేయుట. ఈ రెంటివలనను ప్రతి కార్యమందును జయముసిద్ధించును వీనిని మీరినట్లైతే కలుగు నష్టములను కొన్నిటిని సూచించుము. కాలమువృథా చేసినయెడల నా కాలము తిరిగి రాదనియు అలస్య మమృతమ్ విషమ్ అనియు మొదలైనసంగతులనుజెప్పి పాఠశాలకుపోవుటయందును ఉద్యోగమునకుపోవుటకును సభలకుపోవుటకును భోజనమునకును సమయపరిపాలనము మిగుల నావశ్యకమని బోధింపవలెను.

(3) వాడుకలు, గుణములు, ఏర్పడుట.

(1) ఉపాధ్యాయుడు బాలురకు నేర్పునట్టివిద్యచేతను తర్ఫీతుచేతను, బాలుడు రెండువిధములుగానభివృద్ధిజెందును. ఈ రెండును పాఠశాలయందునగత్యమే. మొదటిదానివలన అనగావిద్యవలన మనోవికాసముకలిగి విద్య యభివృద్ధియగును. రెండవదానివలన అనగాతర్ఫీతువలన యోగ్యత, నీతి, ఔదార్యము, ధైర్యము మొదలయిన సుగుణసంపత్తియేర్పడును. విద్యకంటె నీతియందలి తర్ఫీతుఎక్కువయని తలచబడవలెను. ఉపాధ్యాయుడు బోధించువిద్యవలన సైతము కొంతయోగ్యతయేర్పడును. సుగుణసంపత్తికలుగునట్లు తర్ఫీతు చేయుటకంటె విద్యనేర్పుట చాలాసులభము. విద్యావంతుడగువాడు మంచిరుచిగలుగునట్లు, బాలురకుబోధించినయెడల విద్యసులభముగా పట్టుబడును. సుగుణసంపత్తి, యోగ్యత, అంతసులభముగానేర్పడవు. మరియు విద్య తరగతికంతకును బోధింపవచ్చును. గుణములైతే ప్రతిబాలునికి తగినట్లు నేర్పవలసియుండును.

(2) సహవాసమువలన మంచిగుణములును చెడుగుణములును ఏర్పడును. తమకంటె పెద్దవారు అక్రమముగాప్రవర్తించుట చూచిరేని బాలురును అట్లుచేయుదురు. తమస్నేహితులు స్వప్రయోజనపరులుగానున్నయెడల తామును అట్లుండగోరుదురు. పాఠశాలవిడువగానే బాలురుచేయుకార్యములను గమనించిచూడుము, వారిచేష్టలను నీతికి దూరములగు వారుచేయుతప్పులను, కనిపెట్టవచ్చును. పాఠశాలాక్రమశిక్షవలన మాత్రము కావలసినయోగ్యతలన్నియు కలుగునని తలపగూడదు. క్రమశిక్ష అధికారముయొక్క ఫలము, అధికారబలములవలన గుణములనేర్పరుప శక్యముకాదు. మంచిగుణములకు తావిచ్చుటకొరకు బాలురచెడుగుణములను ముందుగాధ్వంసముచేయుటకై యుపాధ్యాయుడు ప్రయత్నించవలెను.

(3) బాలురను చక్కగా శిక్షితులు చేయవలెనంటే మంచివాడుకలును, సద్గుణములును, బాలురకు అలవాటుపడునట్లు ఉపాధ్యాయుడు సహాయము చేయవలెను. బాలురకు కొన్ని గుణములు తల్లిదండ్రులవలన సహజముగా కలుగును. మరికొన్ని చూచి నేర్చుకొన్నందువలన అలవాటగును. ఒకపనిని రెండుమూడు సార్లు చేసినప్పుడు అది అభ్యాసమై అలవాటు క్రిందవచ్చును. దానినే మరల మరల చేయుటచేత ప్రయత్నములేకుండ అట్లు చేయుట అలవాటగును. కాబట్టి ఉపాధ్యాయుడు మంచిసంగతులే అభ్యాసమగునట్లు చేయవలెను. ఇది ఏర్పడుటకుతగినకాలము బాల్యము. మంచివాడుకలవలన మంచిగుణము లేర్పడుటకు సాధనమగును. మంచిక్రమశిక్షవలన కలుగుఫలము సుగుణములనితెలచవలెను. మంచివాడుకలనగా క్రమము. పాటుపడుస్వభావము. ఇంద్రియనిగ్రహత్వము, న్యాయబుద్ధి, మర్యాద, పరోపకారత్వము, మొదలగునవియు. ఇవియేగాక నీతికూడా వాడుక పడవలెను.

క్రమశిక్షయొక్క ఉద్దేశములు మంచివిగా నుండవలెను.

తమయజ్ఞానమును తెలిసికొని ప్రశ్నయడుగుటకుగాని మరియొకనిచే నేర్పబడుటకు గాని బాలురుసిగ్గుపడనివారుగా నుండునట్లు క్రమశిక్షవలన చేయబడవలెను, మరియు వారు తమపనియందు ఇష్టముకలవారుగాను పాటుపడువారుగాను కావలెను. బాలురయొక్క అవిధేయస్వభావాదులను నివారించుటకు చాలినన్నిగానుండవలెను, సదభిప్రాయములను కలుగజేయుచు నీతిని గలుగజేయవలెను. బాలునిస్వభావమునకు అనుగుణమైయుండవలెను. వీనిలోనేది మంచిదిగాకయున్నను క్రమశిక్షయు మంచిదిగాకయుండును. ఉపాధ్యాయుని ప్రవర్తనచేతగాని బలాత్కారముచేతగాని క్రమశిక్షయుండునట్లు చేయవచ్చును. మొదటిది మంచిపద్ధతి. లేకుండుటకంటె బలత్కారముగా గలుగజేయుట రెండవపద్ధతి.

క్రమశిక్ష మూడువిధములచే చక్కగానుండునట్లు చేయవచ్చును.

1. బాహ్యసాధనములు 2. మనోసాధనములు. 3. నీతిసాధనములు,

బాహ్యసాధనములు.

(1) మంచిగాలి వెల్తురుకలిగి మురికిలేక మనోహరముగా నుండుగృహము. ఆడుకొనుటకై గానియందు మంచిస్థలము

(2) ఉపాధ్యానియొక్క రీతి, కంఠస్వరము, వస్త్రాధికము మొదలైనవి.

(3) ఉపాధ్యాయునియందు గౌరవమును ఆయన అధికారమును.

(4) చేయవలసిన పనులయొక్క మార్పులు, ఆటకాలము.

మానూసాధనములు.

(1) తెన్నగా చెప్పబడిన విధాయకకృత్యములు.

(2) నేరమునకు తగినశిక్షలు

(3) తరగతులఏర్పాటులు, సరియైనపైతనకీ,

(4) క్రమశిక్షా సంబంధమగు నిబంధనలన్నియూ బాలురెరిగియుండుట.

(5) బోధించు రీతి.

నీతిసాధనములు.

(1) సరియైనశిక్షలు,

(2) సరియైనపాలనము.

ఇవిగాక పెద్దబాలురును సరియైనప్రవర్తన కలవారును, కొన్నిపాఠశాలలయందు మంచిక్రమశిక్షకు సాధనభూతులుగా నుందురు.

III. బాల్యలక్షణములు.

CHARACTERISTICS OF CHILD-LIFE

(1) ముఖ్యములగు మనోవికారములు, భావాదుల ఏర్పాటు, మనోబలము.

బాలురస్వభావములనుబట్టి మనోవికారములు పెక్కులు గలుగుచుండును. ఉపాధ్యాయుడు కలుగజేయునూహలవలన బాలురకు మనస్సనసంతోషము వ్యసనము గలుగుచు కొన్ని మనోవికారములు కలుగుచుండును. ఇట్టి మనోవికారములలో మంచివేవో చెడ్డవేవో బాలురకు ముందుకాలములో నేవియుపయోగించునో ఉపాధ్యాయుడునిశ్చయించి యనుకూలమగుపద్ధతిని భావాదులనేర్పడునట్లు చేయవలయును. బాలురు పెద్దవారైనపిమ్మట కొందరునీతిగలవారుగాను మరికొందరు అన్యాయప్రవర్తకులుగాను కొందరు సజ్జనులుగాను మరికొందరు దుర్మార్గులుగాను నుండుటకుకారణములు తర్బీతులోను క్రమశిక్షలోను ఉండియున్నవి. అందువలన నుపాధ్యాయుడు బాలురస్వభావములను లెస్సగా నెరిగియుండవలెను. ఉపాధ్యాయునికిగల గంభీరత, నెమ్మది, తెలివి, మొదలయినవి బాలురకుసైతము ఆవయస్సునందేగలవని తలపగూడదు. బాలుడనగా ఒకవిచిత్రమగువస్తువని తలచుచు వానినిక్రమముగా మార్గమునకుతేవలెను. బాలుడు సహజముగా నిలకడలేక చంచలముగలవాడుగాను ఇదేమి అదేమి అనితెలిసికొనెడు స్వభావముగలవాడుగాను శ్రద్ధనిలుపలేనివాడుగాను మర్యాదలెరుగనివాడుగాను ఉండును, ఈగుణములను ఉపాధ్యాయుడు సహజములని యొప్పుకొనియుండవలెనుగాని తప్పులనియెన్నగూడదు. వానితొందరను చాకచక్యమునుఅణచిపెట్టి విశేషకాలము ఖైదులోనుంచినట్లు ఒకేరీతిగాకూర్చుండబెట్టినయెడల అట్లుండుటవానికి శక్యముగాక అవిధేయతను కనపర్చును, అదిఉపాధ్యాయునితప్పుగాని వానితప్పుగాదు, బాలుడుచేయు ప్రతితప్పుకార్యములోను ఏదోఒకగుణముఉండును. అదిమంచిచాకచక్యముయొక్క గుర్తుగదా. బాలునితప్పితమువలన మనకు గలిగినఇబ్బందిచే నాతప్పులుతప్పుగా భావింపకూడదు. వాడట్లుచేయుటకు కారణములను లెస్సగావిచారించుచుండవలయును. ఉపాధ్యాయులకు తొందరగలుగజేయునట్టి బాలురయొక్క తప్పుకార్యములను విశేషతప్పుగాభావింపకూడదు, ధ్వనిచేయుట, ఇష్టమువచ్చినప్పుడెల్ల మాట్లాడుచుండుట, వస్తువులను ధ్వంసముచేయుట, అశుచిగానుండుట, ఈము

దలయిన స్వల్పతప్పితములన్నియు నివారింపవలసినదే కాని ఇవియేమో ప్రపంచము మునిగి పోవునంతటి తప్పితములుగా ఉత్ప్రేక్షింపగూడదు. కాబట్టి బాలునియొక్క స్వభావాదు లను వానినీతిపరిమితియు నెరిగియుండవలెను.

(౨) ముఖ్యమయిన సహజజ్ఞానములు, భావములు, అనగా చాకచక్యము, అనుకరణము, పరిశోధకబుద్ధి, సమ దుఃఖత లేక కనికరము ప్రతిస్పర్ధ, భయము.

బాలురకు సత్ప్రవర్తనకలుగచేయుటకును దుర్గుణములను నివారించుటకును బాలు రయందు తగినహేతువులను కనిపెట్టినయెడల అవిమంచిక్రమశిక్ష యగును ప్రతిబాలుని యందును స్వభావములు వేరువేరుగా నుండునుగదా. ఉపాధ్యాయుడు వానినికనిపెట్టి నడిపించినయెడల క్రమశిక్షయు, విద్యయు, యోగ్యతయుకలుగును. వారిస్వభావములను తెలిసియున్నయెడల చక్కగానడపవచ్చును. అవి పెద్దయంత్రములవంటివి. అవి చక్కగానడ పబడినప్పుడు ఎంతపనినైనను చేయును. నడపుటలో లోపముకలిగినపుడు నడపువానికి సైతము హానికలుగజేయును. ఆభావాదులు ఈక్రింద వివరింపబడును.

చాకచక్యము.

ఆరోగ్యముగలబాలురు స్వాభావికముగా చాకచక్యముగానుందురు. అందువలన పనిలేక ఊరకకూర్చుండుట వారికి బాధకరముగానుండును. ఆచాకచక్యము దేహమునకును మనస్సునకును చెందియుండును. అట్టివారి చాకచక్యమును పాఠశాలయందు విద్యావిష యములందు ఉపయోగపెట్టలేక వారికార్యములకు తానువిసుకుజెంది తనపాపకర్మముచేత నట్టివారు తనపాలబడిరని ఉపాధ్యాయుడు భావింపగూడదు.

అనుకరణము.

అనుకరణమనగా తానేదిచూచినను అట్లుచేయవలెనను స్వభావము, ఎవరేదిచేయ చున్నను చూచి తాముకూడ అట్లుచేయవలెనను నుత్సాహము బాలురకు గలుగుచుండును. ఈశక్తిచేతనే ఉపాధ్యాయుడు చేయుపనియందు బాలురు లక్ష్యముంచి నేర్చుకొన కోరుదురు.

పరిశోధకబుద్ధి.

దీనినే జ్ఞానసంపాదనేచ్ఛ అందురు. దీనివలన మిగులప్రయోజనముగలదు. తప్పు దారినిపోకుండ దీనిని కాపాడవలయును. దీనివల్లనే బాలురకుగల అజ్ఞానముపోయి జ్ఞాన

ముకలుగుచున్నది. ఈస్వభావమును చక్కగా నుపయోగించనేరని యుపాధ్యాయుడు పనిముట్లువాడలేని వడ్రవానివంటివాడు. ఈశక్తిని బాలురయందు అనేకమంది అణగగొట్టి నాశనము చేసియున్నారు.

సమదుఃఖత.

ఈగుణమువలన బాలురు తమతోడిబాలురయందును ఉపాధ్యాయునియందును కనికరము గలిగియుందురు ఉపాధ్యాయుడు శ్రద్ధతో పాటుపడుచున్నయెడల బాలురకును దీనివలన శ్రద్ధకలుగును.

ప్రతిస్పర్ధ.

దీనివలన ఒకరినొకరు మించవలెననుతలంపుగలిగి బాలురు విశేషముగా పాటుపడుదురు. ఉపాధ్యాయుడీగుణము చక్కగా పట్టుకొనిరానియెడల బాలురలో అసూయ కలుగును.

భయము.

రాబోవుకాలమందు కీడుకలుగునను భయమువలన బాలునివిద్యకు కొంతమంచికలదు. ఈభయమువలన బాలుడు ఉపాధ్యాయునిమనస్సు నొవ్వకుండునట్లు నడచుకొనును. దీనివలననే ఉపాధ్యాయుడు తన్నుచీవాట్లుపెట్టునని తలచుచు సాధ్యమైనంతమట్టుకు తప్పుచేయకుండ ప్రవర్తించును. భయమును హెచ్చుచేసి బాలునితెలచుగా బెదిరించినయెడల చెరుపుకలదుగాని దానివలన లాభములేదు.

ఈక్రిందివి ముఖ్యములగుభావములు. ఉపాధ్యాయులు వానినిఉపయోగింపజేసి బాలుని మంచిస్థితికి తేవచ్చును.

(1) పనిచేయుటవలన సంతోషము.

బాలుని చాకచక్యము విద్యాసంగ్రహణమునకు బాల్యములో మొదటి యాధారము. మనోబల దేహబలములు రెండును వృద్ధిపొందునట్లు చేయవలెను. బాలునిస్వభావమునకు అనుగుణమగు ప్రతిపనిని నిరాటంకముగాజరుపుచు బాలుర మనశ్శక్తిని వృద్ధిపొందించును.

(2) మంచిమాటలవలన గలుగు సంతోషము.

బాలుడుచేయుపని యంగీకరింపబడినపుడు వానికి మరింత సంతోషముగలుగుచుండును. ఉపాధ్యాయుడు వివేచనాశక్తితో అర్హమగు రీతిని బాలురను ప్రోత్సాహముచేసినయెడల వారు మిగుల నుత్సాహముతో విశేషపరిశ్రమ చేయుదురు. అది మితములేక అతిఅయి

నరెండిల దానివలన చెరుపుగలదు. స్తోత్రమే అక్కరలేదు. వారివనివలన మనము సంతసించితిమని ముఖవికాసముచేత తెలుపుడు చేసినను చాలును.

(3) బహుమానములవలన గలుగు సంతోషము.

బహుమానములవలన బాలురకు విశేషపరిశ్రమచేసి చదువవలయునను కుతూహలముగలుగును. వీనివలన కొన్నినష్టములుగలవుగాన ఉపాధ్యాయుడు మెలకువగలిగి బహుమానములు ఇవ్వవలెను.

(4) తనతోడివారి మెప్పు.

బాలుడు తనతోడివారు ఏమనుకొందురోఅను నభిప్రాయముతో వారిమెప్పును పొందుటకై చక్కగా పనిచేయు చూచుచుండును. ఇదిగాక జనులయొక్క సదభిప్రాయమును పొందవలెనని కోరుచుండును.

(5) జయమువలనగలుగు సంతోషము.

నానాటికి విద్యయభివృద్ధియగు కొలదిని బాలునికి మంచి ఉత్సాహముగలుగుచుండును. ఒకరికంటె నొకరు మించవలయునను నూహ యతిశయించుచుండును.

(6) సరియైనపనిచేయుచున్నామను ఆనందము.

బాలుడు తనవిధాయకకృత్యమును నెరవేర్చుచున్నప్పుడు ఆనందము గలుగుచుండును. ఎవరికేనిదయను ఉపకారబుద్ధిని కనపరచినపుడు దానివలన సంతోషముకలుగుచుండును. పైసంగతులన్నియూ చెప్పబడినయట్లు లేక వ్యతిరేకములైనప్పుడు బాలుని మనస్సునకు బాధకలుగుచుండును.

సంకల్పము లేక చిత్తము.

దేహముమీదను మనస్సుమీదను అధికారమును గలిగియుండి మనతలంపులను ప్రవర్తనను నడపునట్టి శక్తికి సంకల్పమని పేరు. అది ఇష్టమునచ్చినట్లు పనిచేయింపనుగలదు నిలుపనుగలదు. సంకల్పము బలమును కలుగచేయులేదుగాని కలిగియున్న మనోబలమునంతను ఉపయోగించునట్లు చేయగలదు. అనేకములగు మనోవికారములవలనను శక్తులవలనను చిత్తము చాలచక్కగానే ప్రేరేపింపబడును. బాలురయొక్క మనోబలము స్వల్పముగనుక

తగినసాధనములచే దానిని బలపరచుచు పనిచేయవలెను. అందువలన తగినరీతిని తర్బీతు చేయవలెను, క్రమమైనదానిని బాలురు వాడుకచేయునట్లును పట్టుదల అలవాటుచేసికొనునట్లును వారొనరించుకార్యములవలన గలుగు సాధకబాధకములను యోచించునట్లును కోపమునణచునట్లును నెమ్మదినికలిగి యుండునట్లును నేర్పవలెను. చిత్తము అలవాటుపరిచినరీతిని ఉపయోగపడుచుండును.

IV. క్రమశిక్షకు సాధనములు.

Means of securing discipline.

(1) మంచి పాఠశాలా ఏర్పాటులు, కవాతు, కొన్నిచట్టములు, మొదలగు నేర్పాటులు.

మంచి క్రమశిక్షకు గొన్ని యితరాంశములును ఆవశ్యకములగుచున్నవి. అవి అత్యం అగత్యము కాకపోయినను కొంతమట్టునకైనను క్రమశిక్షకు మంచి సహాయకారులై దానిని వృద్ధిపఱచును. అవి ఏవిఅనగా, (1) మంచి పాఠశాలాఏర్పాటులు, (2) కవాతు, (3) కొన్నిచట్టములు లేక నిబంధనలు.

మంచి పాఠశాలా ఏర్పాటులు.

తగిన పాఠశాలాగృహములు, ఇరుకులేమి, మంచివెలుతురు, గాలియువచ్చునట్టి వీలు, తగినబల్లలు మొదలైనవి. ఇవి లేనియెడల మంచిక్రమశిక్షకు భంజకముగానుండును. ఏకదృష్టితో తరగతినంతను ఉపాధ్యాయుడుకనిపెట్టుటకు వీలులేనిచోట్లను బాలురుకూర్చుండుటకు చాలని ప్రదేశములలోను బల్లలు మొదలైనవి హెచ్చుతగ్గులచే నిబ్బందికలుగజేయుచోట్లను, ఎండవేడిమిచే బాలురు బాధపడుచోట్లను వేరువేరుతరగతి బాలురు కూర్చుండుటకు తగిన వీలులేక క్రిక్కిరిసియుండుచోట్లను తనగిపాఠములకు తగినయుపాధ్యాయులులేని చోట్లను కాలనిర్ణయ పత్రికలు చక్కగానేర్పరుపబడి యుండనిచోట్లను క్రమపద్ధతియు క్రమశిక్షయు గలుగజేయుట దుస్తరము.

అధికశీతమును విశేషముఎండయు అమితగాలియు ఆకలి అలసట మొదలగునిబ్బందులున్నయెడల బాలుర శ్రద్ధ చదువునందుండదు గాన వానిని నివారించుటకై యత్నించి ఆయిబ్బందుల తొలగించితేనేతప్ప మంచిక్రమశిక్ష యుండనేరదు. పని చక్కగా జరుగుటకై చేయబడవలసిన పాఠశాలా ఏర్పాటులన్నియు విద్యావిషయములోను క్రమశిక్ష విషయములోను మిగుల ముఖ్యము. ప్రతియుపాధ్యాయునికిని తగినచోటును తగినరీతిని తగినపనిని పెట్టవలయునేగాని విసుకుగలుగునట్లు అధికపనిఇచ్చి ఇబ్బందికలుగజేయకూడదు.

కాలనిర్ణయపత్రికలు ఒక తరగతికి ధ్వనిగలపాఠము జరుగుచున్నపుడు మరియొక తరగతికి ధ్వనిలేనిపాఠమును ఇంకొక తరగతికి సగముధ్వనిగల పాఠమును జరుగునట్లు చే

యవలయును, మఱియు అవసరమైనప్పుడెల్ల దేహమును మనస్సును జరుగుచున్న పనినుండి మార్చునట్లును, కవాతు, విశ్రాంతి వీనికి సమయముకొనునట్లును ఏర్పరచవలయును.

మంచి ఏర్పాటులవలన ప్రతిబాలునికి తగిన తరగతిలో వేయుటచేతను ప్రతితరగతికి ఒక నిర్ణీతమైనపనిని ఏర్పరచుటచేతను ప్రతివానికి పనికలిగియుండునట్లు చేయుటచేతను స్థలమును అంశమును తగినకాలములో మార్చునట్లు ఏర్పరచుటచేతను ఒకపాఠము వెంబడి మరియొకపాఠమును క్రమముగా జరుపుటచేతను ప్రతిదినము ప్రతిగంటయందు ప్రతి తరగతిని ఉపాధ్యాయుని శిక్షక్రింద ఉంచుటచేతను మంచి క్రమశిక్ష చక్కగా నేర్పడును.

కవాతు, లేక డ్రిల్లు.

గమనమును నిలుపుటకును క్రమపద్ధతిని కలిగియుండునట్లు చేయుటకును అలసటను పోగొట్టి విశ్రాంతిగలుగజేయుటకును ఉపయోగింపబడు పలువిధములగు డ్రిల్ కదలికలు తక్కిన ఇతరయుపాయములు క్రమశిక్షకు మిగుల ముఖ్యమగు సహాయకారులు. అందువలన బాలురందఱు ఒక్కటిగా కలిసియుండి పనిచేయుటకును పరస్పరానురాగము కలిగియుండుటకును ఒకరివలె మఱియొకరు చేయుటకును అలవాటగును. ఈ డ్రిల్లువలన ఆజ్ఞకు వెంటనే లోబడుటయను వాడుక ఏర్పడుటయేగాక బాలురకు ఉత్సాహమును కలుగజేయును. నిరంతరవిద్యాకృషిచేత కలుగునలసటను నివారించును. చక్కగాజరుపబడినడ్రిల్లు క్రమపద్ధతికిని క్రమశిక్షకును సహాయకారి.

దీనివలని ప్రయోజనములు.

(1) కాలము కూడివచ్చును.

(2) కొంచెము మాటలతో పనిజరుగును.

(3) ఉత్సాహమును గలుగజేయును.

(4) సంతోషముగా లోబడునట్లు చేయును.

(5) పాఠశాలాపనియందు మనోహరమగు భేదమును గనపఱచును.

(6) కండరములకు పనిగలుగజేసి విశేషపనిచేత నరములకుగలుగుబాధను నివారించి చాకచక్యమును గలుగజేయును.

నిబంధనలయొక్క చట్టములు.

పాఠశాలకు సంబంధించిన నిబంధనలను కొంచెముగా వ్రాసియుంచవలెను. విశేషముగా నున్నయెడల వానినన్నిటిని బాలురవలంబించుట యశక్యము. పాఠశాలా పాలనయందు అగత్యమగువీనిని అగత్యమైనయెడల బాలురకు వివరించిచెప్పవచ్చును. అయితే

ఈ అన్ని నిబంధనలను వివరించి చెప్పవలసినయవసరములేదు. నిబంధనలనేర్పరచుటలో నీ క్రిందినూచనలు పనికివచ్చును.

(1) ఒకనిబంధనను ఏర్పరచుటకు ముందుదానిని చక్కగాయోచించుము,

(2) లోబడుటకు వీలుపడనియాజ్ఞలను ఎప్పుడును ఇవ్వకుము,

(3) నీవాజ్ఞాపించునపుడు శాంతముతోను పట్టుదలను తెలియజేయు స్వరముతోను పట్టిబెదరింపులు కాఠిన్యములేని వైఖరితోను ఆజ్ఞలనిమ్ము,

(4) నీవాజ్ఞాపించునపుడు దానిప్రకారము జరుగనియెడల వెంటనేకనుగొనుటకు వీలున్న యట్టియాజ్ఞలనిమ్ము.

(5) నీయాజ్ఞలను బతిమాలునట్టి స్వరముతోనియ్యక యధికారస్వరముతోనిమ్ము.

(6) ఒకసారి యాజ్ఞాపించినదానిని అనగత్యముగా మరలచెప్పకుము,

(7) ముఖ్యమగునాజ్ఞలను నిబంధనలను వ్రాతయందు గనపరచుము.

(8) అధికముగా నధికారముచేయుట మానుము అనగా బాలురస్వాతంత్ర్యముల జోలికిపోవునట్లు అనవసరముగానాజ్ఞలను పెంపుచేయకుము.

(2) ఉపాధ్యాయుని యధికారము.

ఉపాధ్యాయునికిబాలురు లోబడియుండునట్లు చేసికొనుహక్కుగలదు. ఈహక్కు బాలురతల్లిదండ్రులు బాలురను ఉపాధ్యాయుని వశముచేయుటవలన కలిగినది, అందువలన తనకిట్టి హక్కుకలదనియు కావలసినయెడల దానినుపయోగింప గలననియు తనయధికారమును బాలురెదిరింపగూడదనియు వారికిస్పష్టపరచవలయును. అదితాను పాలించుపద్ధతినిబట్టియుండును. తెలివిగలయుపాధ్యాయుడు బాలురవిద్యావిషయమై తనకుగలభారమునుగూర్చి ఇతరులతో ముచ్చటించుచు ఎల్లవారు తనయందు మంచియభిప్రాయముగలిగియుండునట్లు చేసికొనవలయును.

బాలురవలన నుపాధ్యాయుడు కోరునట్టివిధేయత న్యాయమైనదిగా నున్నయెడల సులభముగా లోబడియుందురు. అన్యాయమగునాజ్ఞల నిచ్చినయెడల తనయాజ్ఞకు భంగముగలుగును. కాబట్టి ఆజ్ఞలనిచ్చుటలో మంచిజాగ్రత యుండవలయును, ఈయధికారము బాలురలాభముకొఱకుగాని ఉపాధ్యాయుని తృప్తికొరకుగాదు.

అధికారము నుపయోగించునపుడు ఈక్రిందియంశములను గమనించుము.

(1) నీవు అధికారముకలవాడవుగా తోచునట్లు ఆజ్ఞాపింపకుము.

(2) నీయధికారమును జాగ్రతగా కాపాడుకొనుము.

(3) నీయధికారమునంతను ఒకేసారి ఉపయోగింపక నిలువలోనుంచుకొనుము.

(4) బాలునికి నన్యాయముగా దోచునట్టియంశమునకు విరుద్ధముగా నాజ్ఞాపింపకుము.

(5) లేనిపోని యధికారదర్పమును చూపింపకుము.

(3) జనులయభిప్రాయము, దానివలనిప్రయోజనము, అదిపాఠశాలలో నేర్పడువిధము.

పాఠశాలయందు విద్య బాలురకుచక్కగా వచ్చుచున్నదనియు సత్ప్రవర్తన, నీతి, సుగుణసంపత్తి కలుగుచున్నవనియు పాఠశాల జనరంజకముగానున్నదనియు చెప్పుకొనుటకు జనాభిప్రాయమని పేరు. జనుల సదభిప్రాయమువలన పాఠశాల యభివృద్ధినొంది ఉపాధ్యాయునికి గౌరవము కీర్తియుగలుగును. క్రమశిక్ష బాగుగానుండుటకు బాలుర మనస్ఫూర్తియగుతోడ్పాటు ఉపాధ్యాయుని అధికారమునకు రెండవదిగానున్నది. ఉపాధ్యాయుడు పాఠశాలాభివృద్ధినిగూర్చి బాలురకు శ్రద్ధగలుగులాగున చేయవలయును. ఇట్లుచేసినయెడల జనాభిప్రాయముకూడ మంచిదిగానుండును. ఉపాధ్యాయుడు పాఠశాలయందలి లోపములనుకనిపెట్టి నివారణచేయవలెను. బాలురలో ముఖ్యమగువారికి కొందరికి కార్యనిర్వాహకత్వము తనయాజ్ఞలను జరుపుటమొదలగు నధికారములను ఈయవలయును. తాను బాలురయందు విశ్వాసముంచి తనయందు బాలురు విశ్వాసముంచునట్లు చేయవలయును. తనపాఠశాలవిషయమై జనులసదభిప్రాయమును కలుగజేసికొనుట ఉపాధ్యాయునికి విధాయకకృత్యముగా తలచుకొనవలయును. ఉపాధ్యాయుని సుబోధనచేతను మంచిఏర్పాటులచేతను వివేచనాశక్తిచేతను పాటుపడుటచేతను పాఠశాల జనరంజకముగా నుండును.

(4) సహజజ్ఞానములు, భావములు, వీనియొక్క ఉపయోగము, వీనిని నిర్వహించుటయును.

విద్యావిషయములో బాలుర సహజజ్ఞానములకు తృప్తియు భావములకు కృషియు కలుగునట్లు చేయవలయును. బాలుర మనశ్శక్తులలోనుండి సహజముగా నుత్పన్నములగు గుణములకు సహజజ్ఞానములని పేరు. వానిలో ముఖ్యమైన వెవ్వియనగా.

(1) చాకచక్యము, (2) వస్తునిర్మాణము. వస్తువినాశనము. (3) రసగ్రహణము. (4) పరిశోధకబుద్ధి. (5) అనుకరణము.

చాకచక్యము.

బాలురు నిరంతరము కదలుచుండుటకు నభిలాషగలిగియుందురు. అందువలన రెండుమూడు నిమిషములైనను ఊరకయుండుట వారికికష్టము. ఉయ్యేలలో పండుకొను శైశవదశయందు నయితము ఎంతసంతోషముతో చేతులుకాళ్లు కొట్టుకొనుచు నాడించుచుందురో చూచుచున్నాముగదా. కొంచెమెదిగినపిమ్మట వారికిబోర్లపడవలెనని లేవవలెనని ప్రాకవలెనని నడువవలెనని దుముకవలెనని పరుగెత్తవలెనని కోరికలు ఉదయించుచుండును, కొంతమందిని మనము సోమరులని చెప్పుదుముగాని సోమరితనముకంటె నసహ్యాకరమగు వస్తువు మరియొకటి వారికిలేదు. వారిచాకచక్యము వారినిఎల్లపుడు ఏదోఒకపనిచేయుటకు ప్రోత్సాహపెట్టుచుండును. ఒకప్పుడా చాకచక్యము తప్పుదారిని నయితము పోవుచుండును. ఈచాకచక్యమువారి శరీరస్థితిని మనస్థితినిబట్టి కలుగుచుండును. వారుచేయగలిగినపని ఏదియున్నను దానినిచేయవలెనని కోరుచుందురు. ఈసహజశక్తియే అనేకశక్తులను వికసింపచేయుచుండును సాధకమువలన శరీరము మనస్సు వృద్ధిపొందుచుండును. సాధకముచేయుట స్వాభావికముగా గలుగుచుండును. ఈచాకచక్యమువలననే బాలురు తమయవయవములను దృఢపరచుకొని పనిచేయుదురు. ఉపాధ్యాయుడు శరీరసాధకమువలన బాలురశరీరమునకు సౌఖ్యస్థితిగలుగజేసి మనస్సునకునయితము మంచిస్థితినికలుగజేయవలయును. శరీరము సౌఖ్యస్థితిలో లేనియపుడు మనస్సు మంచిస్థితిలో నుండనేరదుగదా.

బాలురయొక్క కండరములకు నరములకుతగినంతగా చలనముగలిగితేనేతప్ప వానికి తిమ్మిరియు బాధయుగలుగును. అప్పుడున్న దేహస్థితిని నిలుచుంటె కూర్చుండుటయు కూర్చుంటెనిలుచుండుటయుగా మార్చవలెను. శ్రద్ధతోగమనించుచు ఒకపాఠమగువరకు ఒకేవిధముగా పసిబాలురు కూర్చుండలేరు. ఫోటోగ్రాఫ్ తీయించుకొన్న ప్రతివారికిని ఈకష్టము తెలియును. తెలివిగలయుపాధ్యాయులు ఈసహజ చాకచక్యమునకు తృప్తిగలుగజేయుటయేకాక దానిని విద్యాసాధనముగా కూడ నుపయోగింపవలయును కాబట్టి ప్రతిపాఠమునందును బాలురు ఏదోపని గలిగియుండునట్లుచేయవలయును. గణితములోను వ్రాతలోను బాలురచేతులకు పనిగలిగియుండును. కొన్నిటిలో బాలురు ఊరకకూర్చుండి వినవలసినవారగుదురు. అట్టిసమయమందు మంచిక్రమశిక్ష యుండనేరదు. బోధించుపాఠము మనోహరముగానుండుటచే దానియందు బాలురమనస్సు లగ్నమైతేనేతప్ప వారిచేతులకు పనిలేదుగనుక అవియూరకుండవు. కాబట్టి యుపాధ్యాయుడు తనబాలురందఱు అన్ని పాఠములయందును చాకచక్యముతో పనిగలిగియుండునట్లు చేయవలెను. భూగోళపా

మందు స్థలములను పటముపై చూపించుమనుచు ఉపయోగకరమై జ్ఞాపకముంచుకొనదగిన యంశములను పలకలపై వ్రాయించుచు ఆలసటచెందునపుడు వారియునికిని మార్చుచు మధ్య మధ్య కవాతుచేయించుచు పనికలిగియుండునట్లు చేయవలెను.

చాకచక్యము తప్పుదారినిపోకుండునట్లును అది అతిశయించకుండునట్లును జాగ్రత చేయవలెను. బాలురయొక్క వికాసస్థితిననుసరించి చాకచక్యమునకు పనికలుగజేయువల యును. ఒకప్పుడు పనికివచ్చుపని మరియొకస్థితిలో పనికిరాకపోవును. పెద్దవారుచేయ గలిగినపనిని బాలురచేజేయింపగూడదు. అట్లు చేయింపబోవుట వారికి విసుకు గలుగ జేయుటగదా.

వస్తునిర్మాణము, వస్తువినాశనము.

ఈచాకచక్యములో దేనినైనకట్టుటకును వస్తువులనుభేదించుటకును బాలురకెంతో ఇష్టముండును. బాల్యములో బొమ్మరిల్లుకట్టుట, పిచ్చుకగూళ్లుకట్టుట మొదలైనపనులను బాలురుచేయుట చూచుచున్నాముగదా. ఒకబొమ్మను చేతికిచ్చినపుడు అదిఎట్లుచేయ బడినదో కనుగొనుటకై దానికాళ్లుచేతులువిరిచివేయుటనయితము చూచుచున్నాముగదా.

రసగ్రహణము.

బాలురకు రంగులయందును చక్కనియాకృతులయందును సంగీతమందును నాట్య మందును ఎంతో ఆనందముగానుండును. శిశువు రంగుబొమ్మలు మొదలగు సుందరమగువస్తు వులనుచూచియు జోలపాటలనువినియు సంతసించును. పుస్తకములలోనుండు బొమ్మలను చూపితే బాలురుఎంతఆహ్లాదపడుదురో మనమెరుగుదుముగదా.

పరిశోధకబుద్ధి.

బాల్యములో బాలుడడుగువింత వింత ప్రశ్నలవలన ఈశక్తివారికెంతగలదో ఎఱు గవచ్చును, ఒకవస్తువును తాకుటయందును రుచిచూచుటయందును వాసనచూచుటయం దును బాలునికిమిగుల నిష్టముగానుండును. నూతనవస్తువులయందు ఈబుద్ధిమిగుల మిక్కు టము. బాలురు తమచేతికిదొరికిన ఏవస్తువునైనను పీకిపీకి దానియందేమున్నదో కనుగొన గోరదరు, పెద్దవారైనపుడు వానివిషయమై జ్ఞానమును పుస్తకములద్వారాగాని ఉపా ధ్యాయులద్వారాగాని పొందగోరుదురు, ఈశక్తికి మంచిదారి చూపకపోయినయెడల అదిచెడ్డదారిని వెతుకుకొనును. బాలురడుగు మంచిప్రశ్నలకుమాత్రము జవాబులనిచ్చుచు ఈశక్తినివృద్ధిపరుపవలెను, అన్నిటికినిజవాబులిచ్చినయెడల బాలురుఅధికప్రసంగులగుదురు,

అనుకరణము.

ఒకరు చేయుచుండుదానినిచూచి వారివలెతాము చేయవలెననుశక్తికి అనుకరణమని పేరు. ఈశక్తి క్రమక్రమముగా నభివృద్ధిపొందును, అందువలన మనముమంచికార్యములను బాలురుచూడగా చేయవలెను, ఈశక్తివలననే బాలునికి విధేయత సత్కార్యాచరణము కలుగుచున్నవి. మంచిసహవాసమువలన మంచిగుణములును చెడ్డసహవాసము వలన చెడ్డగుణములును కలుగునది ఈశక్తివల్లనే.

భావములు, (Motives.)

(1) సహానుభవత.

బాలురయొక్క పురోవృద్ధియందు ఉపాధ్యాయునికి మంచియభిమానము గలిగియున్నయెడల దానిని సులభముగా బాలురుతెలుసుకొనగలరు. రుచిలేనియట్లు పాఠము చెప్పినయెడల అదితెలుసుకొనుటచేతనే అశ్రద్ధగానుందురు. అందువలన బాలురకు ఉపాధ్యాయునియందు దయగలిగియుండదు. ఉపాధ్యాయుడెట్లుండునో బాలురునుఅట్లుందురు. తాను తెలివిగాను చురుకుగానున్నయెడల బాలురును అట్లుందురు. తానుసోమరిగానున్నయెడల వారును సోమరులుగానుందురు.

(2) ప్రతిస్పర్ధ.

ఈగుణమువలన తాను ఇతరులను మించియుండవలెనను తలంపుగలుగును. అందువలన బాలురుపాటుపడి పని చేయుదురు. ఉపాధ్యాయుడు దీనిని చక్కగా కనిపెట్టకపోయినయెడల దీనివలన అసూయ గర్వముమొదలగు చెడుగుణములుగలుగును.

(3) అంగీకారమందిచ్ఛ.

పెద్దవారికివలెనే బాలురకు నయితము తమ్ము ఎవరైనను మెచ్చుకొన్నయెడల తమ పని బాగుగానున్నదని చెప్పినయెడలను సంతోషము కలుగును. అందుకై యుపాధ్యాయుడుబాలురు చేయు పని బాగుగా నున్నయెడల బాగుఅని కొన్ని ప్రోత్సాహ వచనములను అనుచుండవలెను. ఇట్టిప్రోత్సాహములయందు ఈక్రింది వానిని గమనింపవలెను.

(1) సహజ సామర్థ్యము గలిగి తెలివి గల బాలురను స్తోత్రము చేయక పాటుపడుచు జాగరూకులగువారిని స్తోత్రము చేయుము.

(2) అట్టిసన్మానముకు ఒకపద్ధతిననుసరించి చేయవలయును.

(3) సన్మానము పాటుపడునట్టి వారికేగాక నీతిగల వారికి కూడా జరిగింపవలెను.

(4) స్తోత్రము తగినట్టుండవలెనుగాని విశేషముగా కూడదు. మిగుల తక్కువయుం గారాదు.

(5) తమలోపములను సవరించుకొని బాగుపడు బాలురను సన్మాన విషయములో మరువకుము.

(6) ఏ బాలుడు గాని విశేషసన్మానమునకు అర్హుడని తోచినయెడల అట్టి దానిని బహు జనసమక్షమందు జరిగించుము.

(4) అవమాన భయము.

సన్మానాసక్తి వలె అవమానభయము నయితము కొంత ప్రయోజనకారి. చీవాట్లు పెట్టుటచేత కొందరు సత్ప్రవర్తనకువత్తురు. చీవాట్లు న్యాయముగా పెట్టవలసినదేగాని తనకుగల కోపమును బట్టియుండగూడదు. అవియు విశేషముగా కూడదు. ఒకనేరస్థుని చీవాట్లుపెట్టునపుడు ఉత్త-చీవాట్లేగాక అట్టితప్పితము చేయగూడదనియు అది నీతిగాదనియు బాలునికి దెలియపరచవలెను. చీవాట్లు పెట్టునపుడు పరిహాసము చేయకూడగు. కొన్ని వేళలయందుమాత్రము విశేషము గర్వగ్రస్తుడగు బాలుని చీవాట్లుపెట్టునపుడు పరిహాసము నుపయోగింప వచ్చును

(5) బహుమానములు, శిక్షలు.

వీనినిగుఱించి కావలసిన యంశములన్నియు విశదముగా వ్రాయఁబడును.

బహుమానములను శిక్షలను ఉపాధ్యాయుడు వివేకముతో చేసినయెడల పాఠశాలయందు క్రమశిక్ష చక్కగానుండును. అవి ప్రభుత్వముచేయువారందరిచేతను ఉపయోగింపబడును. పాలనమునకై ఏర్పఱుపబడిన నిబంధనలన్నియు నీరెండుకారణములచేత నవలంబింపబడి పని జరిగింపబడును. సన్మానావమానములచే పాఠశాలయందు క్రమశిక్ష చక్కగానుండును, జ్ఞానముగల ప్రతిజంతువునకు మంచి,చెడ్డ,బహుమానము,శిక్ష,చెప్పినట్లు చేయుటకు మంచికారణములు.

బహుమాన మనగా నేదోరూపముగా కొంతమట్టునకు సంతోషమును గలుగజేయుట. శిక్ష యనగా అదేరీతిని బాధనుగలుజేయుట. సంతోషము ప్రేరేపకముగా పనిచేయును, బాధ తప్పుపనిని ఆటంకపరచునదిగానుండును. బహుమానమువలన కోరికయు శిక్షవలన భయమును కలుగును.కోరికయు భయమును లేనియెడల క్రమశిక్షయేయుండదు,

పాఠశాలయందు బహుమానములు శిక్షలు ఉపాధ్యాయునియోగ్యతనుబట్టి ప్రయోజనకరముగానో నిష్ప్రయోజనకరముగానో ఉండును. ఒకడు ఒకబహుమానమునిచ్చుటకంటె మఱియొకడు ఆదరసూచకముగా గనపరచిన చిఱునగవు మేలుగా నెన్నబడును. గౌరవము లేనిమనుష్యుడు బెత్తముతో శిక్షించినదానికంటె మాననీయుడగు మరియొకడు చీవాట్లుపెట్టిన శ్రేష్ఠముగానుండును ఎల్లప్రభుత్వములవలెనే చిన్నరాజ్యము ననుకరించు పాఠశాలయందును ఈబహుమానములు శిక్షలు అగత్యము. వీనిలో ప్రతిది రెండువిధములనవచ్చును.

(1) బహుమానములయొక్క, శిక్షలయొక్క ఫలోత్పాదకశక్తి వానియందు బాలురకుగల గణ్యతవలన అనగా గౌరవతిరస్కారమువలన గలుగునో అవి అప్రధానమగు బహుమానములు శిక్షలు అనబడును

(2) సన్మానావమానంబులే గాక వస్తురూపకముగా నివ్వబడు బహుమానములును శరీరదండనయును కలుగజేయునట్టివి ప్రధానబహుమానములు శిక్షలు అనబడును.

బహుమతులును శిక్షలును పాఠశాలయందు వెక్కగాను సాధారణముగాను ఉండగూడదు. మనము ప్రతిదినము విధాయకకృత్యములను చేయుటవలన వాస్తవమైన బహుమానము లేకపోయినను, చేయకపోవుటవలన, చేయలేదను నింద లేకపోవుచున్నది.

పాఠశాలయందు బహుమానములు సామాన్యముగా పాటుపడువారికిని మంచిప్రవర్తనగలవారికిని ఇవ్వగూడదు. అసాధారణమగు యోగ్యతగలవారి కియ్యవలెను. శిక్ష తఱచుగానున్నయెడల దాని యుపయోగమే లేకపోవును. అరుదుగా చేయబడినప్పుడు ఒకవిధమైనక్షోభమును గలుగజేయును. బాలురను సరళమార్గమున చక్కగా నడిపినయెడల బహుమానములతో శిక్షలతో నంతగా పనిలేకపోవచ్చును.

బహుమానములవలని ప్రయోజనములు.

(1) తత్కాలమందుగాని ముందుగాని యోగ్యతను అంగీకరించినట్లగును.
(2) కలిగియున్న సంతోషమును వృద్ధిపరచును.
(3) విశేషము పాటుపడుటకు ప్రోత్సాహము కలిగించును
(4) తనతోడివారికంటె చక్కగా పనిచేయవలెనను బుద్ధి అతిశయించును.

వానినుపయోగించుటకు నాక్షేపణలు.

(1) ఒకరినొకరు మించవలెనని కోరికగలవారికి నిచ్చుటలో గలకష్టము ఇందువలన కొందరుపాధ్యాయులు బహుమానములనిచ్చుటను నిల్పివేయుచున్నారు.

(2) సత్ప్రివ_ర్తనకు బహుమానము ముఖ్యోద్దేశముగా తలపబడునట్టి స్వభావము, ఇందువలన బహుమానములు లంచములవంటివని కొందరు చెప్పుచున్నారు.

(3) సామాన్యులకంటె తెలివిగలవారికి నిదియొకలాభము,

(4) బహుమానములయం దేదియైనగణ్యత నుంచవలసినయెడల నవి మిగుల కొద్ది మందికే ఇవ్వబడవలయును. అందువలన అసూయాదులు ఉత్పత్తియగును.

(1) అప్రధాన బహుమానములు.

ఇవి కేవలము తలంపునకుమాత్రము గౌరవాస్పదములు. బాలురవలన నవి ఎట్టిగౌరవముగలవని తలపబడునో ఆతలంపునుబట్టి వానికి విలువగలుగును ఒకనాడొక ఉపాధ్యాయుడు ఒకబాలుని అతను ఇంటికిచ్చుపాఠమును మిగుల చక్కగా సిద్ధముచేసికొని వచ్చినందుకు అందరికి తెలియచేయుటకై ఎత్తుగా బల్లమీదనిలువబెట్టి అతనిని పొగడెను. మరియొకనాడు పాఠము రానందుకై మరియొకనిని ఆబల్లమీదనే నిలువబెట్టెను, చూడు ఒకనికి సన్మానముగానున్నతావు మరియొకనికి నవమానమయ్యెను,

పాఠశాలయందు అప్రధానబహుమానములలో ఈక్రిందివి సులభముగా నందుబాటులో నున్నవి.

• (1) మెచ్చుట. బాలురకు తమతోడివారలలో ఉపాధ్యాయునివలన మెప్పుపడసినపుడు మిగుల ానందముగా నుండును. ఉపాధ్యాయుడు ఇష్టమువచ్చినట్లందరిని మెచ్చుకొనరాదు. తగినంతకారణములేక, మెచ్చుకొనరాదు. మందమతులయ్యు పాటుపడువారు స్తోత్రార్హులు.

(2) తరగతిలోనుండు స్థితికిగౌరవమిచ్చి మైస్థలములిప్పించుట. పాఠములోసరిగా జవాబుచెప్పినవారిని పైకిపంపుట ఒకనికిశిక్షయు రెండవవానికి బహుమానమును అగుచున్నది. అందువలన బాలురందరు చురుకుగా నుందురు,

(3) మార్కులిచ్చుట. తగినబాలురకు మార్కులిచ్చుటచేత ప్రోత్సాహమెక్కువై మంచిఫలమును కలుగజేయును.

(4) నమ్మకముంచి యిచ్చుకొన్నిపనులు. మార్కులరిజిస్టరు ఒకనిస్వాధీనముచేయుట, తరగతిపుస్తకములు బోధనోపకరణములు మొదలైనవి కావలసినప్పు డిచ్చుచు మరలతీసుకొను బాధ్యత, తరగతికి మానిటరుగా నేర్పరుచుట, మొదలైనవి దీనిక్రిందవచ్చును. ఇవిస్వల్పముగాకనపడినను వీనిని ఉపాధ్యాయుడు ప్రయోజనకారిగా నుపయోగించుకొనవచ్చును.

(2) ప్రధానబహుమానములు.

ప్రధానబహుమానము లనగా వస్తురూపముగా నివ్వబడునవి. ఇవి ఇచ్చుచోట్ల ఈక్రిందిసంగతులను గమనింపవలెను.

(1) అవి అందరి యందుబాటులోనుండవలెను, అనగా అర్హుడగు ప్రతిబాలుడు బహుమానమును పొందునట్లుండవలెను.

(2) అవి నిజమైనయోగ్యతకుగాని గొప్పశ్రేష్ఠతకుగాని ఇవ్వబడవలెను. విద్యాధిక్యత, సహజమగు తెలివి, వీనికంటె శాంతముతో పాటుపడుట శ్రేష్ఠముగా నెన్నబడవలెను.

(3) అవి వివేకసులభముగాగాని తఱచుగాగాని దొరకునట్లుండ రాదు. మామూలుఅయినయెడల గొప్పబహుమానమునయితేము బహుమానముగా తలపబడదు, సాధారణమగుసంగతి గొప్పది ఎట్లుకాగలదు.

(4) న్యాయముగా నివ్వబడినట్లు అందరిచేతను తలపబడవలెను. క్రమముగా వచ్చుటకును, వేళకుసరిగావచ్చుటకును, సత్ప్రవర్తనకును, నయితము బహుమానములియ్యవచ్చును.

శిక్షలు.

శిక్షయనగా విధాయకకృత్యమును నెరవేర్పక అశ్రద్ధచేసినందుకు దేహమునకుగాని మనస్సునకుగాని కలుగజేయబడుబాధ. శిక్షయనగా శరీరదండనయేగాక మాపులచేతను మాటలచేతను కలుగజేయబడు అప్రధాన శిక్షలను కూడాకలుపుకొనుచున్నది.

శిక్షలయొక్క ఉద్దేశములు.

(1) తప్పుచేసినవానిని బాగుపరచుట. ఇందుకై దోషి తనకు శిక్షన్యాయమైనదిగా తలచవలెను. మరలతప్పుచేసిన యెడల శిక్షకలుగునను భయముపుట్టునంత కఠినముగానుండవలెను. మఱియు శిక్ష నలుగురిలోతలవంపులుఅని తలచవలెను. తప్పుచేసినయెడల అవమానముగల్గునని తోచవలెను, ఎప్పుడుగాని చేసినతప్పునకు పొందినశిక్షకు చెల్లుఅని బాలుడుతలచునట్లుండ రాదు. ఉపాధ్యాయుడును వెంటనేవానియందు దయగానుండక అనాదరణతో కొంతకాలమువరకు చూచుచుండిపిమ్మట వాడునయితేను మంచిబాలురవలె తనదయకుపాత్రుడగునట్లు చేయవలెను.

(2) తప్పుచేసిన బాలుడు మరలతప్పుచేయకుండుటకును ఆశిక్షనుచూచిన ఇతరులు అతప్పుచేయకుండునట్లుదృష్టాంతముగానుండవలెను, చూచువారికి శిక్షాభీకరమైన

దనియు ఇట్టిశిక్షనుకలుగ జేసెడు ప్రవర్తనతప్పనియు, తోచవలెను. అయినను శిక్షవిశేషము కఠినముగా నుండకూడదు.

(3) తప్పుచేసిన వారికి దండనగలుగునను తలంపుఁబుట్టించు ప్రతిఫలమును ఇచ్చెడు న్యాయము. న్యాయము కనికరముతో కలిసియుండవచ్చును. అయితే ఈప్రతిఫలము ద్వేషముచేత పగదీర్చుకొనునదిగానుండకూడదు. నీకుగల ఇతరద్వేషము చేతగాని తప్పుచేసిన వానియందు నీకుగల చెడ్డయభిప్రాయముచేతగాని నీకు గలిగిన కోపముచేతగాని శిక్షను విధింపకూడదు.

శిక్షతో సంబంధించిన యితరనియమములు.

(1) నేరమును చక్కగా విమర్శించి న్యాయముగా శిక్షను విధింపవలెను. కొందరు ఏమియు న్యాయములేక ఇచ్ఛవచ్చినట్లు బాలురను శిక్షింతురు. మరికొందరు ఒకనియమములేక ఒకేనేరమునకు పలువిధములుగా శిక్షింతురు.

(2) తప్పితమని బాలురకు తెలిసినకార్యమునకే బాలురను శిక్షింపవలెను.

(3) శిక్ష నేరముయొక్క ఫలితముగానుండవలెను.

(4) శిక్ష నేరమునకు తగినదిగానుండవలెను. బాలుర చిన్నతనపు స్వభావముచేత చేయునట్టి క్రమశిక్షా లోపములను పెద్దతప్పులుగా నెన్నకూడదు.

(5) ఇతరుల యభిప్రాయముచేత శిక్షయొకప్పుడు కఠినమైనదిగాను మరియొకప్పుడు వట్టినిరర్థకమైనదిగాను తలపబడును.

(6) శిక్షలను తగ్గింపవలెను. సాధ్యమైనమట్టుకు అన్నివిధములగు శిక్షలను విడిచిపెట్టవలెను. శిక్ష తగ్గితేనే తప్ప పాఠశాలయభివృద్ధికి రానేరదు.

ఈక్రిందివి శిక్షావిషయమై పనికివచ్చును.

(1) నేరము చేయుటకు అవసరమును కలుగనీయకుము. తప్పుచేయించి దిద్దుటకంటె చేయకుండ నాటంకపరచుట మంచిది.

(2) మంచితలంపులు కలుగునట్లు సహాయము చేయుము.

(3) అక్రమములు కనపడగానే నివారణచేయుము. మొదటనైతే తేలిక శిక్షలు చాలును. గోటితో పోవు దానిని గొడ్డటికి నగత్యమువచ్చువరకు పెరుగనిచ్చుట కూడదు.

(4) బాలురు చేయవలసిన విధాయకకృత్యములను ముందుగా స్పష్టముగా తెలియజేసి పిమ్మట వాని నాచరించునట్లు చేయుము.

(5) కాఠిన్యముకంటె శిక్ష తప్పక జరుగుట ప్రయోజనకారి. తప్పుచేసినయెడల ఉపాధ్యాయుడు కనిపెట్టుననియు శిక్ష తప్పక జరుగుననియు బాలుర అభిప్రాయము గల్గియుండునట్లు చేయుము కఠినముగాను ఉండకూడదు, శిక్షించకను ఉండకూడదు.

(6) మంచిధోరణి వృద్ధిచేయుము. నీవుచేయునది బాలుని మంచికొరకు అని వారికి తెలిసినయెడల వారికి నీయందిష్టముండును. అందువలన తప్పుచేసినట్లైన నీకప్రీతి కలుగుననియు తమకు శిక్షకలుగుననియు భయపడుదురు.

(7) నీకు సాధ్యమైనమట్టుకు శిక్ష లేకుండ చేయుము.

పాఠశాలాశిక్షలు.

(1) అవమానమును కలుగజేయునవి. (2) దేహమునకు నొప్పిని గలుగజేయునవి. అప్రధానమగు శిక్షలు అవి కలుగజేయు నవమానము ననుసరించి ప్రయోజనకారులుగా నుండును.

ఈక్రిందివి అప్రధానమగు ముఖ్యశిక్షలు.

(1) చీవాట్లుపెట్టుట సన్మానమువలెనే దీనిని అరుదుగా నుపయోగింపవలెను.

(2) మార్కులను తగ్గించుట.

(3) బల్లమీదగాని తరగతివెనుకగాని బాలుని నిలువబెట్టుట.

(4) ఏదో ఒక బండపనియిచ్చి వ్రాసుకొనిరమ్మని చెప్పుటయు, ఇంపోజిషనులు ఇచ్చుటయు,

ప్రధాన శిక్షలు.

(1) పాఠశాలా కాలమైనపిమ్మట తప్పుచేసినవానిని పాఠశాలయందుంచుట, అట్టి వానిని ఊరకనుంచినా ఉంచవచ్చును. లేక విద్యావిషయకమగుపనిని దేనినైనా చేయింపవచ్చును. వానితోకూడ ఉపాధ్యాయు డుండవలసియుండును. వానిని వేళకుభోజనము మొదలైనవానికొరకు పంపుచుండవలయును.

(2) శరీర దండన విధాయకకృత్యములను చేయుటను నేర్పుటకొరకును తప్పు కార్యమును నివరించుటకును ఉపయోగింపబడుచున్నది. పూర్వకాలమందు శరీరదండన తఱచుగాను భయంకరముగాను చేయబడుచుండెను. ఇటీవలన ఉపాధ్యాయులు దానిని చాలామట్టుకు తగ్గించుచున్నారు, ఇంకను పల్లెటూళ్లయందు ఉపాధ్యాయులు కొంతమట్టుకు భయంకరమగుశిక్షలను విధించుచున్నారు. శరీరదండన అధమమగు శిక్షయనియు,

దానిని విధిలేనియుప్పుడు వాడవలసినదనియు ఉపాధ్యాయులందరు ఏకగ్రీవముగా చెప్పుదురుగాని పెక్కుమంది దానిని ఇంకను వాడుకచేయుచున్నారు. అయినను అవిధేయత మొదలైనవానివలన కలుగు చెఱుపుకంటె శరీరదండనను ఉపయోగించుటవలన కలుగు చెరుపు చాలాతక్కువ. అయినను ఉపాధ్యాయులు ఏబాలునిగాని కొట్టకయు పాఠశాల నుండి వెడలగొట్టకయు పనిజరిగింపవచ్చును. ఒకవేళ శరీరదండన అగత్యమైనయెడల ఉపాధ్యాయుడు శరీరదండనశక్తిని ఉంచుటవల్లను వెంటనే శిక్షించకపోవుటచేతను కొంత మట్టునకు శిక్షయొక్క క్రౌర్యము తగ్గును. ఉపాధ్యాయు డెప్పుడుగాని బెత్తమును చాటుగానుంచవలసినదేగాని చేతిలోనుంచుకొని తిరుగగూడదు. రూళ్లకఱ్ఱ మొదలగు కఠినమగు వానితో కొట్టగూడదు. చేతిలోనే కొట్టవలసినది గాని మరియొకచోటగూడదు. తల మీద ఎప్పుడును కొట్టగూడదు.

శరీరదండన బహిరంగముగా చేయవచ్చు నని కొందరును రహస్యముగా చేయవలె నని మరికొందరును చెప్పుచున్నారు. గొప్పతప్పితములకు బహిరంగముగా చేసినయెడల కొన్ని నేరములకు విధింపబడిన శిక్షను ఇతరబాలురు చూడలేదని నేరస్థుడగు బాలుడు సిగ్గునుపొందకయుండుటయే గాక ఉపాధ్యాయుడును తొందరపడక నిదానముగా శిక్షించును. మరియు శిక్షయొక్క క్రౌర్యమును తగ్గియుండును. రహస్యముగా శిక్షజరిగించినందు వలన ఒకానొకబాలుడు ఎదిరించినను అది ఇతరబాలురకు తెలియక యుండవచ్చును.

ఈ క్రింది నేరములకు శరీరదండన తగియుండును.

(1) అబద్ధములు క్రూరత్వము మొదలగుదుర్మార్గములు.
(2) నిరంతరము అశ్రద్ధగానుండుట.
(3) అవిధేయత మొదలగుమూర్ఖములు.
(4) నిబంధనలకు లోబడి నడచుకొనకుండుట.

దండనవిషయములో నీక్రిందవానిని గమనించుము.

(1) నేరస్థుని నేరమును వానికి తెలియపరచవలెను.
(2) నేరస్థుడు తనతప్పును సవరించుకొనునట్లు చెప్పును.
(3) ప్రధానోపాధ్యాయుడు మాత్రమే శరీరదండనను విధింపవలెను.

ఈక్రిందిలోపములు బాలురవలన తఱచుగా కలుగుచుండవచ్చును. అట్టివి మరియొకవిధముగా చక్కబడనియెడల శరీరదండన విధింపవచ్చును.

(1) అశ్రద్ధ (2) వేళకుసరిగా రాకపోవుట. (3) సోమరితనము. (4) మర్యాద లోపములు, (5) దుర్భాషలు. (6) తిట్లు (7) తనతోడివారికి హానిచేయుట. (8) రాళ్లు విసరుట, (9) అల్లరిచేయుట. (10) కోపపడుట. (11) ముంగోపము. (12) పరదూషణ. 13) మూర్ఖత్వము. (14) లోబడకయుండుట. (15) అధికప్రసంగము, (16) పాఠశాలకు రాక పారిపోవుట. (17) తనకంటె బలహీనులగు బాలురను కొట్టుట. (18) అబద్ధములాడుట, (19) మోసముచేయుట. (20) కాపిచేయుట.

క్రమశిక్ష ఇంతటితో సమాప్తమనవచ్చును. అయినను ఈక్రిందియంశములు ముఖ్యములగుటచే నిందుఁ జేర్పఁబడుచున్నవి. తరగతిపరిపాలన, తరగతిబోధన, నేర్చుకొనుట, బోధించుట, మంచి తరగతిపనికినుండవలసిన ముఖ్యలక్షణములు, విద్యయొక్క యుద్దేశము.

తరగతిపరిపాలన.

తరగతి పరిపాలనయనగా తరగతి బాలురందరిని ఉపాధ్యాయుడు వశపరచుకొను టయు బోధించుటయునని అర్థమగుచున్నది. బోధనకుముందు బాలురందరు ఒకక్రమము తోగమనించునట్లు చేయుట ఆవశ్యకముగదా. ఈశక్తిలేనినాడు ఉపాధ్యాయుడు చక్కగాబోధింపనేరడు. మనోహరమగు బోధనయున్నపుడు అదిబాలురను వశపరచుకొను టకు సహాయకారిగా నుండును.

మనము బోధించుటకై తరగతిని స్వాధీనములో నుంచుకొనుచున్నాము. ఇదిముందుగా కావలసినవిషయము. అయితే బోధనముఖ్యమగుపని. పాలనాశక్తియు బోధనాశక్తియుకలిసియున్నను వేరుగాని ఒకటికావు. ఒకటియున్నయెడల రెండవదియుండునని చెప్పుటకు వీలులేదు. వశపరచుకొనుట ఉపాధ్యాయుని రీతి, నీతి, గుణము మొదలైన వానినిబట్టి యుండును. బోధన విద్యాతిశయమునుబట్టియు బోధనా సామర్థ్యమునుబట్టియు ఉండును. కొందరు మంచిబోధకులుగానున్నను క్రమశిక్షయందు అసమర్థులుగా నుందురు. ఈరెండుశక్తులను ప్రయత్నముచేత కొంతవరకు అలవాటు చేసికొనవచ్చును.

మంచిపాలన నిజమైనదిగాను నిశ్చయమైనదిగాను దయతోకూడినదిగాను,వివేచనాశక్తికలదిగాను ఉండవలెను. ఉపాధ్యాయునియొక్క మనస్సు చట్టముగా నుండవలెను. తనయధికారమును బాలురు శంకించి తననుగురించి ఏమియు మాట్లాడక యుండునట్లు చేయవలయును.

బాలురు ఇష్టముతోపనిచేయుట,అట్లుచేయనియెడల బలాత్కారముగాచేయించుట.

ఉపాధ్యాయుడు తెలివితో ప్రవర్తించి బాలురు తన ఇష్టమువచ్చినట్లు చేయు లాగున గట్టిపట్టుపట్టవలెను. వారట్లుచేయనియెడల బలవంతముగా చేయింపవలెను. అందువలన ఉపాధ్యాయుడు తనపట్టుదలను ఈక్రిందినాలుగు అంశములచేతను నుండుగాని బాలునికి తెలియపరచవలెను.

(1) ఈపని నీకు విధాయకకృత్యము.

(2) నీవు దీనిని చేయవచ్చును.

(3) కాబట్టి దీనిని ఇప్పుడు చేయుము.

(4) నీవు చేయనియెడల బలాత్కారముగా నీవలన చేయింపబడును.

అధికారధిక్కారము చేయుటకు కారణములు కొన్ని ఉపాధ్యాయునివల్లను మరికొన్ని బాలురవల్లను కలుగుచుండును. బోధన లోపముగానున్న చోట విధేయతయుండుట కష్టము. ఉపాధ్యాయునికి ఆసక్తి, పట్టుదల, మొదలైనవిలేని యపుడు సైతము బాలురణగియుండరు. కొందరు బాలురు తమనైజ ధర్మములగు అశ్రద్ధ మొదలగువానిచే అధికారనిరాకరణము చేయుచుందురు. కాబట్టి నీయధికారమును జాగరూకతతో జరుపుము.

ఈక్రిందివానిని గమనించుము.

(1) నీయధికారదర్పము బాలురకు తోచునట్లు ప్రవర్తింపుము.

(2) అశ్రద్ధ మొదలగు లోపములను మొదటనే నివారణ యుము.

(3) విధేయత సాధ్యమగునంతమట్టుకు సులభమగునదిగా చేయుము.

(4) సత్ప్రివర్తనగల వారుగానుండు భారము బాలురదని కనపరచుము.

(5) పాఠశాలా నిబంధనలను మీరినయెడల వెంటనే శిక్ష కలుగునను నమ్మకము బాలురకు కలుగజేయుము.

తరగతిబోధన.

దీనియందు మంచిపని జరుగుచుండవలయును. మంచిపనియనగా నీక్రిందివి.

(1) ఉపాధ్యాయుడు బాలురశక్తియు, వారికి గావలసినయంశములను ఎరిగియుండి తానేమి బోధింపవలెనో తెలిసియుండుట.

(2) బాలురకు నేర్పవలసినయంశమును చక్కగా సులభపరచి వారికి సుఖముగా బోధపడునట్లు చేయుట.

(3) బాలురుకూడ చక్కగా పాటుబడుట.

మంచిబోధనకు గుర్తులు.

(1) పిండివంట రుచిగానున్నదనుటకు తినుటయే దృష్టాంతమన్నట్లు మంచి బోధనకుగుర్తు బాలురకు చక్కగా సంగతులు ఒంటబట్టుటయే.

(2) పద్ధతి. పాఠమందు బాలురందరు సంతోషముతో శ్రద్ధగానున్నయెడల అదియే మంచిపద్ధతియని యూహింపవచ్చును.

నేర్చుకొనుట, బోధించుట.

ఎవరైనను దేనినైనను నేర్చుకొన్నారన్నయెడల వారు దానిని తమశక్తి నుపయోగించి తమంతట తాము నేర్చుకొన్నారని యర్థము.

మంచిబోధన బాలురను నేర్చుకొనునట్లు చేయును. అట్లు చేయుట ఉపాధ్యాయుని పని. నేర్చుకొనునట్లుచేసెడి ఏపనియైనను బోధనయగును. బాలునికి శ్రద్ధగలుగునట్లు ప్రోత్సాహపరచి చక్కగా నేర్చుకొనునట్లుచేయుట ఉపాధ్యాయునిధర్మము.

మంచితరగతిపనికినుండవలసిన ముఖ్యలక్షణములు.

(1) బాలురకు ఉపాధ్యాయునికిని గలపరస్పరప్రేమయు, సహాయమును.

(2) చేయుపనిసహజముగా తగియుండుట.

(3) ప్రతి యంశమును పూర్తిగా బోధించుట

(4) మంచిబోధనవలన గలుగు తెలివితేటలు.

(5) ప్రతియంశముప్రతిబాలునికి తెలియునట్లుచేయుట.

(6) బాలుడుసంతోషించునట్లు కనపడుట.

మంచియుపాధ్యాయుడు ఈక్రిందియంశములను గలిగియుండవలెను.

(1) సూక్ష్మబుద్ధి. (2) సహేతుకజ్ఞానము. (3) ఇంగితజ్ఞానము. (4) బాలురకు తగినట్లుతానుప్రవర్తించు నేర్పు. (5) ధారాళమగు భాషాజ్ఞానము. (6) శ్రద్ధ, క్రమము, ఉత్సాహము కలిగియుండునట్లుచేయుశక్తి. (7) మనోనిశ్చయము. (8) మనోహరమై

గంభీరమగు వైఖరి, (9) అంశములయందు సంపూర్ణజ్ఞానము, (10) బాలురను చక్కగా నడపుకొనివచ్చునట్టి నైపుణ్యము.

విద్యయొక్క యుద్దేశము.

దీనివలన బాలురయొక్క మనశ్శక్తులు చక్కగా యుక్తకాలములో వికసించునట్లు చేయవలెను, ఇంతియేగాక అంశములను బాలుర మనస్సున పట్టియుండునట్లు చేయవలెను.

ANANDA PRESS MADRAS.